వాల్మీకి రామాయణం.. అందరికీ ఆదర్శ కావ్యం

జయంతి సభలో మంత్రి స్వామి, వక్తలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన ఆదర్శ కావ్యం రామాయణమని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. వాల్మీకి జయంతిని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. వాల్మీకి మహర్షి రామాయణంలో కుటుంబ బాంధవ్యాలు, పరిపాలన అంశాలు సమాజానికి తెలిపారు. గత ప్రభుత్వం బీసీలకు 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందే తప్ప కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకుండా చేసిందని ఎద్దేవా చేశారు. బీసీలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ.. విలువలను భావితరాలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ.. బీసీలకు అవసరమైన భవనాలను ఒంగోలులో నిర్మించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత, జిల్లా బీసీ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అంజల, లక్ష్మానాయక్, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని, మేయర్ సుజాత తదితరులు



ఒంగోలు నగరంలో గస్తీని పర్యవేక్షిస్తున్న ఎస్పీ దామోదర్

ఎవరు మీరు.. ఎందుకు తిరుగుతున్నారు!

▸ చెలరేగుతున్న చోరులు ▸ తనిఖీలు చేపట్టిన పోలీసులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల కాలంలో చోరీలు పెరిగాయి. ఒంగోలు కాకతీయ నగర్‌లో పది రోజుల క్రితం ఒక వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఆ తర్వాత రోజే ఆమె తీవ్ర అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తాజాగా ఒంగోలు గోపాల్‌నగర్‌లో ఒక వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి 15 సవర్ల ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సాయినగర్‌లో జీజీహెచ్ వైద్యుడు సుబ్బారావు ఇంటిలో దొంగలు పడి 22 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించారు. బుధవారం రాత్రి ఒంగోలు పరిసర ప్రాంతాల్లోనూ చోరులు హల్‌చల్ చేశారు. టంగుటూరు స్టేషన్ పరిధిలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో చోరీకి యత్నించారు. ఒంగోలు రామ్‌నగర్ ఎనిమిదో లైనులో ఒక నర్సింగ్ కళాశాల కార్యాలయంలో రూ. 45 వేలు దోచుకెళ్లారు. హౌసింగ్ బోర్డులోని ఒక ఇంట్లోనూ దొంగతనానికి తెగబడ్డారు. కేవలం ఒంగోలు మాత్రమే కాదు, జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ చోరీలు నిత్యకృత్యంగా మారాయి.

▸ **దొంగల ముఠాలొచ్చాయా..!:** వరుస చోరీల నేపథ్యంలో జిల్లాలోకి దొంగల ముఠాలు ప్రవేశించి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఎస్పీ దామోదర్ గురువారం నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము 4.30 గంటల వరకు తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

▸ **అదుపులో అనుమానితులు...:** జిల్లావ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి పోలీసులు రోడ్డెక్కారు. విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము 4.30 గంటల వరకు ఈ తనిఖీలు సాగాయి. రాత్రివేళల్లో తిరిగే వాహనాలను సోదా చేశారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వేటికీ మినహాయింపు ఇవ్వలేదు. అనుమానితులను ప్రశ్నించారు. అర్ధరాత్రి వేళ ఎందుకు తిరుగుతున్నారు, ఏ కారణంతో బయటకు వచ్చారు. ఎక్కడికి వెళ్తున్నారంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సహేతుకమైన కారణం లేకుండా తిరుగుతున్న వారిని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో జిల్లా ఎస్పీ దామోదర్ కూడా పాల్గొన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను అప్రమత్తం చేస్తూ తనిఖీల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు.

కన్నీటిలోనే కర్షకుని కష్టం..

▸ వాయుగుండంతో వరుస వానలు
▸ తడిసి మొలకెత్తిన సజ్జ కంకులు
▸ నీళ్లు నిలిచి ఉరకెత్తిన పొగాకు మొక్కలు
▸ రూ.20 కోట్లకు పైగా నష్టపోయిన రైతులు


ఈనాడు, ఒంగోలు; ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: అల్పపీడనం అన్నదాతల చేతికి పంటలు అందకుండా చేసింది. వరుసగా నాలుగు రోజులపాటు కురిసిన భారీ వర్షాలు కర్షకులను కన్నీట' ముంచాయి. సజ్జ పంట మరో వారంలో ఇంటికి చేరేది. అంతలోనే వరుణుడు కత్తి దూయడంతో కండెలు తడిసి మొలకెత్తి పనికిరాకుండా పోయాయి. కాయ దశలో ఉన్న మినుము, పొట్టదశలో ఉన్న వరి పంటలూ దెబ్బతిన్నాయి. కండె దశలో ఉన్న మొక్కజొన్న నీరు పోసుకుని మొక్కలొస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశలో ఉన్న వరి కంకులు నేలవాలాయి. కొన్నిచోట్ల పొలాల్లో నీళ్ల నిలిచి పొగాకు మొక్కలు ఉరకెత్తాయి. పత్తి, మిర్చి మొక్కలు నీట మునిగాయి. ఇంకొన్నిచోట్ల అలసంద, మిర్చి, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. వ్యవప్రయాసలకోర్చి సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో దెబ్బతినడంతో కర్షకులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పొలాల్లో నిలిచిన నీళ్లను బయటికి మళ్లించడానికి శ్రమిస్తున్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో 1,706 మంది రైతులకు చెందిన 2,062 హెక్టార్లలో పంటలు దెబ్బతిని.. రూ. 16 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అనధికారిక అంచనా.

▸ **ఉద్యాన పంటల ఉసురు తీసిన వానలు...:** భారీ వర్షాలు ఇరవై మండలాల్లో సాగు చేసిన మిర్చి, కూరగాయల తోటలపై తీవ్ర ప్రభావం చూపాయి. కురిచేడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు, రాచర్ల, అర్ధవీడు, బేస్తవారపేట, కనిగిరి తదితర మండలాల్లో మిర్చి ఎక్కువగా సాగు చేశారు. మొత్తం 22,350 హెక్టార్లలో సాగు చేయగా భారీ వర్షాలకు 410 హెక్టార్లలో 50 శాతానికి పైగా దెబ్బతిన్నట్లు క్షేత్ర స్థాయి అధికారులు జిల్లా కార్యాలయానికి సమాచారం పంపారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. వర్షానికి పూత రాలిపోవడంతో పాటు, పొలాల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వేసిన మొక్కల్లో అధిక శాతం దెబ్బ తింటాయని, మళ్లీ వేసుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద మిర్చి రైతులకే రూ. 3.07 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అనధికారిక అంచనా. 35 హెక్టార్లలో కూరగాయల తోటలు, పది హెక్టార్లలో అరటి, అయిదు హెక్టార్లలో బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు ఉద్యాన శాఖ అధికారులు మొత్తం 700 మంది రైతులు నష్టపోయినట్లు ప్రాథమికంగా గుర్తించి కలెక్టర్‌కు నివేదించారు.





పేరుంబొట్లపాలెం, పొట్లపాడులో వాడుముఖం పట్టిన పొగాకు, మిరప పైర్లు





తాళ్లూరు: వర్షాలతో నేలవాలిన ఓ వరి చేను, తడిసి మొలకలు వచ్చిన ధాన్యం



నష్టం అనధికారిక అంచనా రూ.16 కోట్లు.
(విస్తీర్ణం: హెక్టార్లలో)

పంట	గ్రామాలు	మండలాలు	దెబ్బతిన్న విస్తీర్ణం	రైతులు
సజ్జ	38	08	1,565	1,275
మినుము	08	01	457	402
వరి	02	01	40	29
మొత్తం	48	10	2,062	1,706

▸ ఉద్యాన పంటలు: 463 హెక్టార్లు
▸ బాధిత రైతులు: 700
(నష్టం అనధికారిక అంచనా రూ.4 కోట్లు)

పొగాకు ఉరకెత్తి రూ. లక్షల్లో నష్టం...:

అయిదు ఎకరాల్లో యాభై రోజుల క్రితం పొగాకు సాగు చేశాను. మొక్కల్లో ఎదుగుదల బాగుందని సంతోషపడ్డాను. ఇంతలో వర్షం కారణంగా పొలాల్లోకి నీరు చేరి నిలిచింది. నాలుగు రోజులుగా అదే పరిస్థితి ఉండటంతో మొక్కలు ఉరకెత్తి వాడుతున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ. 50 వేలు చొప్పున అయిదింటికి రూ. 2.50 లక్షల వరకు వెచ్చించాను. మళ్లీ కొత్త మొక్కలు నాటడానికి పెట్టుబడి పెట్టక తప్పని దుస్థితి.

– గోసు నరసింహులు, తర్లుపాడు



ఒంగోలు: నీటిలోని గుంతలో దిగి ఓ పక్కకు ఒరిగిన బస్సు




కనిగిరి: మొలకలు వచ్చిన సజ్జ కంకులు



ఒంగోలు: ఓపెన్ జిమ్‌లోని వ్యాయామ పరికరాల వద్ద నిలిచిన వర్షపు నీరు



ఒంగోలు: మంగమ్మ కళాశాల వద్ద ఈత కొలనును తలపిస్తున్న సర్వీసు రోడ్డు



ఎక్కడున్నావు రమణా!

● ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గోల్‌మాల్
● అజ్ఞాతంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్
● అధికారుల తీరు పైనా అనుమానాలు

వైకాపా హయాంలో నిర్వహించిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గోల్‌మాల్ చోటుచేసుకుంది. ఒంగోలు కేంద్రంగా రెండు ఎలైట్ మాల్స్‌తో పాటు 14 దుకాణాల్లో సుమారు రూ.అయిదు కోట్ల మేర నగదును మెక్కేశారు. ఈ విషయాన్ని అధికారులు ఇప్పటికే ప్రాథమికంగా నిర్ధారించారు. ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మార్నేని రమణతో పాటు కొందరు దుకాణ సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఎప్పటికప్పుడు జమా లెక్కలు తేల్చాల్సిన నాటి అధికారులు తమ బాధ్యత విస్మరించారు. దీంతో ఈ వ్యవహారంలో ఇప్పుడు వారి ప్రమేయం పైనా అనుమానాలు రేకెత్తుతున్నాయి. – న్యూస్‌టుడే, ఒంగోలు

▸ **చేతులు కాలాక ఆకులు...:** ఒంగోలులోని రెండు మాల్స్‌తో పాటు, 14 దుకాణాల్లో సుమారు రెండేళ్లుగా అక్రమం వ్యవహారం నడుస్తున్నా అధికారులు గుర్తించలేకపోయారు. దుకాణాల పర్యవేక్షణ బాధ్యత హెడ్ కానిస్టేబుల్‌దే అయినప్పటికీ వాటిని ఎస్సై, సీఐ స్థాయి అధికారులు నిర్ణీత కాల వ్యవధిలో పరిశీలించాల్సి ఉంటుంది. ఏమైనా అక్రమాలను గుర్తిస్తే తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. ఈ భారీ కుంభకోణంలో ఎక్సైజ్ అధికారులు అందుకు భిన్నంగా వ్యవరించారు. కనీస తనిఖీలు చేపట్టిన దాఖలాలు కూడా లేవు. ఇప్పుడు మేల్కొని చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా వ్యవహరిస్తున్నారు. అయినా దర్యాప్తులో ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. కుంభకోణం విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. నిధుల గోల్‌మాల్‌పై పోలీసులకు ఎక్సైజ్ అధికారులు ఫిర్యాదు చేశారు. శాఖాపరంగా అంతర్గత విచారణ చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ ఒక్కరే ఈ వ్యవహారంలో సూత్రధారిగా వ్యవహరించారా.? దుకాణాల సిబ్బంది పాత్ర ఎంతమేరకు ఉందనే విషయంపై ఆరా తీస్తున్నారు. వీరిలో ఒక మాల్ సూపర్‌వైజర్‌గా వ్యవహరించిన వ్యక్తి గత కొన్నాళ్లుగా విధులకు గైర్హాజరైనట్లు తెలిసింది.

ఆలస్యం.. నిందితులకు అవకాశం...

ఎలైట్ మాల్‌లో పనిచేసే కొందరు సిబ్బంది కొద్దిరోజుల కిందటే జిల్లా ఎస్పీ దామోదర్‌ను కలిసి భారీ కుంభకోణంపై ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో తాలూకా పోలీసులు విచారణ చేపట్టారు కానీ కేసు నమోదు చేయలేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ రమణను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఎక్సైజ్ సీఐ నుంచీ వివరాలు సేకరించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే రమణ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మరోవైపు మంగమూరు రోడ్డులోని మాల్ సిబ్బంది ఓ న్యాయవాదిని ఆశ్రయించారు. ఈ బాగోతంలో మాల్స్ సిబ్బంది పాత్ర కూడా ఉండొచ్చని అనుమానిస్తున్న పోలీసులు.. వారు ఇచ్చిన ఫిర్యాదుపై మాత్రం కేసు నమోదు చేయకుండా ఎక్సైజ్ అధికారుల ఫిర్యాదు కోసం వేచి చూశారు. ఇదే అదునుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి అజ్ఞాతంలోకి వెళ్లిపోగా., మాల్స్, దుకాణాల్లో పనిచేసి చేతివాటం ప్రదర్శించిన వారు న్యాయవాదిని ఆశ్రయించారు. ఇక ఎక్సైజ్ అధికారులు అంతర్గత విచారణ ఎప్పటికి పూర్తిచేస్తారో, నిందితులపై ఎన్నాళ్లకు చర్యలు తీసుకుంటారో అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహియుద్దీన్ మాత్రం ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి తాము పోలీసులకు నివేదిక ఇస్తామనీ, దాని ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

దెబ్బతిన్న రహదారులపై అధికారుల ఆరా

తాళ్లూరు, న్యూస్‌టుడే: వైకాపా అయిదేళ్ల పాలనలో రహదారులను పట్టించుకోలేదు. గుంతల్లో తట్ట మట్టీ పోసింది లేదు. ఫలితంగా రహదారులు అధ్వానంగా మారాయి. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలతో అసలే గోతులమయమై ఉన్న రహదారులు మరింత అధ్వానంగా మారాయి. దీంతో అధికారులు స్పందించారు. వర్షాల వల్ల రహదారులు ఏ మేరకు దెబ్బతిన్నాయన్న విషయమై విచారించి నివేదికలు పంపాలని జిల్లా ఉన్నతాధికారులు ఆయా శాఖలకు సంబంధించిన మండల స్థాయి సిబ్బందికి సూచించారు. దీంతో పీఐయూ సబ్ డివిజన్, పంచాయతీరాజ్, ర.భ. శాఖల అధికారులు తమ పరిధిలో దెబ్బతిన్న రహదారులను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.


త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని త్రిపురాంతకేశ్వరుని గిరి ప్రదక్షిణను గురువారం వైభవవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో తొలుత తూర్పు ద్వారం మెట్ల వద్ద పూజలు చేశారు. అనంతరం గిరి ప్రదక్షిణగా స్కంద గిరిపై కొలువైన త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి నామార్చన చేస్తూ భక్తులు కొండ చుట్టూ దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర తిరిగారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



ప్చ్.. ఆసుపత్రిలో ఇదేం అపరిశుభ్రత!

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఆసుపత్రిలో పారిశుద్ధ్యం సంతృప్తికరంగా లేదు. డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దుకోవాలి. లోపాలు అధిగమించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి. వైకాపా హయాంలో జీజీహెచ్‌ని పట్టించుకున్న నాథుడు లేరు. ఇంకా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ బోర్డునే ఉంచారు. తొలగించి ఎన్టీఆర్ వైద్యసేవ పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలి..' అని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జీజీహెచ్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లతో కలసి ఆసుపత్రిని ఆయన గురువారం పరిశీలించారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండరు కాలం ముగియడంతో పొడిగించామని.. సక్రమంగా పనులు చేయనందున గుత్తేదారుకు నోటీసులు జారీ చేశామని వైద్యాధికారులు బదులిచ్చారు. ఓపీ విభాగంలో ఎక్కువ సమయం నిరీక్షించకుండా యాప్ ద్వారా రోగుల వివరాల నమోదుకు నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని మంత్రి సూచించారు. గైనికాలజీ విభాగాన్ని పరిశీలించి రోగుల సహాయకులు ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బ్లడ్ బ్యాంకును తనిఖీ చేసి రక్త నిల్వలపై ఆరా తీశారు. ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకుల వారు ప్రభుత్వాసుపత్రులకు కొన్ని యూనిట్ల రక్తాన్ని అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి అహ్లాదకర వాతావరణం కల్పించాలని, అందుకుగాను త్వరలో అధికారులతో అన్ని విభాగాలపై సమీక్షిస్తామని చెప్పారు. మంత్రి వెంట మేయర్ గంగాడ సుజాత, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్, డాక్టర్ బాలాజీ నాయక్ తదితరులున్నారు.



జీజీహెచ్‌లో పరిశీలిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత తదితరులు

కర్నూలు రోడ్డుకు మరమ్మతులు

❖ వివిధ శాఖల అధికారుల పరిశీలన



రహదారిపై నీటిని తోడిన తర్వాత పరిస్థితిని పరిశీలిస్తున్న గనుల శాఖ అధికారి రాజశేఖర్ తదితరులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు కర్నూలు రహదారిలోని యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద రహదారిపై వెట్‌మిక్స్ వేసి మెరుగు పరుస్తున్నారు. ఈప్రాంతంలో రహదారి అధ్వానంగా మారి కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా నీరు పారుతూ వాగును తలపించింది. దీనిపై 'వాగు కాదు కర్నూలు రాచబాటే' శీర్షికన ఈ నెల 16న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. దీంతో రెండు రోజులుగా వివిధ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే మోటార్లను ఏర్పాటుచేసి నీరంతా బయటకు పంపించారు. కంకర, సిమెంటు మిశ్రమం (వెట్‌మిక్స్)తో భారీ గోతులు పూడ్చుస్తున్నారు. స్థానిక కంకర మిల్లుల, ఇతరుల సహకారంతో వీటిని చేస్తున్నారు. పనుల స్థితిగతులను ఉన్నతాధికారులు పరిశీలించారు. గురువారం జిల్లా భూగర్భ గనుల అధికారి రాజశేఖర్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ దేవానందం, ఈఈ గోపీనాయక్, తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర తదితరులు పరిశీలించి సూచనలిచ్చారు. ఆయా యూనియన్ల ప్రతినిధులు లగడపాటి శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి మధుసూదనరావు, యర్రగుంట్ల శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రాకపోకల నిలిపివేత

ఈనాడు కథనాలకు స్పందన

తాళ్లూరు: మండలంలోని దారంవారిపాలెం - తూర్పుగంగవరం రహదారిలోని కొండవాగుపై కాజ్‌వే స్లాబ్ దెబ్బతింది. ఇక్కడ ముప్పు పొంచివున్న నేపథ్యంలో 'ఈనాడు'లో గురువారం 'వరదొచ్చి.. కల్వర్టు కూలి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో కె.సుందరరామయ్య వాహనాల రాకపోకలు నిలిపివేయించారు. తాత్కాలికంగా వ్యవసాయ సామాగ్రి, ముళ్లకంపను వేయించి మూసివేయించారు.



దెబ్బతిన్న కల్వర్టు వద్ద అడ్డుగా ఉంచిన నాగలి, ముళ్లకంప

అక్రమార్కులపై అవ్యాజ ప్రేమ

❖ అక్రమ వెంచర్లతో రూ.కోట్ల స్వాహా

❖ అధికారుల తీరుపై అనుమానాలు

కనిగిరి ప్రాంతంలో స్థిరాస్తి ముసుగులో రూ. కోట్లు స్వాహా చేసిన అక్రమార్కులపై చర్యలకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురపాలక సంఘం పరిధిలో అసైన్డ్, పట్టా భూముల్లోని అక్రమ వెంచర్లలో సరిహద్దు రాళ్లను యంత్రాలతో పెకిలించి పడేశారు. ఆ తర్వాత వారిపై చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే అదనుగా అక్రమార్కులు ప్లాట్లు అమాయకులను అంటగట్టి మళ్లీ దండుకుంటున్నారు.



కూల్చివేతే తప్ప స్వాధీనమేదీ..దేవాంగ్‌నగర్‌లో దృశ్యం

న్యూస్‌టుడే, కనిగిరి :

కనిగిరి ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గడచిన రెండేళ్లలో రెవెన్యూ డివిజన్ కావడంతో పాటు గ్రేడ్ -2 మున్సిపాలిటీగా అవతరించింది. అదే సమయంలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు చకచక సాగుతున్నాయి. దండుకునేందుకు అదే సరైన తరుణమని భావించి గత ఎన్నికల ముందు వైకాపా నేతలు పేట్రేగిపోయారు. కంభం రోడ్డు, పామూరు రోడ్డు, ఒంగోలు రోడ్డు; గార్లపేట, కందుకూరు మార్గాల్లో వందలాది ఎకరాల పశువుల బీడు, ప్రభుత్వ, అసైన్డ్, వాగు పోరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించేశారు. వెంచర్లు వేసి విక్రయించేశారు.

ఇష్టారాజ్యంగా వెంచర్లు వేసి..

కాశిరెడ్డినగర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న 4.70 ఎకరాల అసైన్డ్ భూమిని గత వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు కౌన్సిలర్లు ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించారు. కనిగిరి - పామూరు రోడ్డులో జాతీయ రహదారి పక్కనే నాలుగెకరాల రోడ్డు పోరంబోకు, పశువుల బీడునూ కబ్జా చేశారు. రూ.5 కోట్ల విలువ చేసే ఈ భూమిలో వెంచర్లు వేసి సొమ్ము చేసుకున్నారు. కనిగిరి పొదిలి రోడ్డు మార్గంలో జాతీయ రహదారి పక్కనే ఓ వైకాపా ప్రజా ప్రతినిధి రూ.3 ఎకరాల పశువుల బీడును ఆక్రమించి పురాతన బావిని పూడ్చించి ప్లాట్లు వేసి అమాయకులకు అంటగట్టి రూ. కోట్లు దండుకున్నారు.



కంభం రోడ్డులో అనుమతి లేని స్థిరాస్తి భూములు

ఆదిలో ఆర్భాటం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో అధికారులు వరుసగా దాడులు జరిపి అక్రమ వెంచర్లలో పునాది రాళ్లను తొలగించి హడావుడి చేశారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా నేటికీ వాటిని స్వాధీనం చేసుకోవడంపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు దృష్టి సారించలేదు. రూ. కోట్లు దండుకున్న వారిపై చర్యలకు ఉపక్రమించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ అక్రమ వెంచర్లను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆక్రమణకు గురైన కొన్ని భూములను గుర్తించామన్నారు. ఇప్పటికే కొన్ని కట్టడాలు, అక్రమ లేఅవుట్లను, వెంచర్లను స్వాధీనం చేసుకున్నామని మిగిలిన వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.

జరుగుమల్లిలో అత్యధిక వర్షపాతం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వరుసగా నాలుగో రోజు కూడా మోస్తారు వర్షం కురిసింది. జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా జల్లులు పడ్డాయి. మండలాల వారీగా వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి...

మండలం	వర్షపాతం(మి.మీ)		
జరుగుమల్లి	80.8	పొన్నలూరు	39.2
మద్దిపాడు	71.6	సీఎస్‌పురం	38.8
టంగుటూరు	67.7	పెద్దదోర్నాల	36.3
కొండపి	68.6	చీమకుర్తి	35.6
తాళ్లూరు	56.6	సింగరాయకొండ	34.8
ఒంగోలు	50.8	కొత్తపట్నం	32.1
సంతనూతలపాడు	46.2	తర్లుపాడు	30.8
మర్రిపూడి	40.4	నాగులుప్పలపాడు	29.2

(బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు)

నేడు షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

పేర్నమిట్ట(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: పేర్నమిట్టలోని జడ్పీహెచ్ఎస్‌లో షూటింగ్ బాల్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపిక చేపడుతున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ కొల్లా నారాయణరావు పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్లు అక్టోబర్ 20, 21 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల లిస్టు, కాపీలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

కేజీబీవీ పోస్టులకు మెరిట్ జాబితా విడుదల

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్రశిక్ష సొసైటీ పరిధిలోని కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తు చేసిన వారి ప్రాథమిక మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో డి.సుభద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వగా అర్హులైన వారు దరఖాస్తు చేశారన్నారు. వాటిని పరిశీలించిన అనంతరం మెరిట్ జాబితాను సమగ్రశిక్ష వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. దరఖాస్తుదారులు పరిశీలించుకొని ఏమైనా అభ్యంతరాలుంటే శుక్ర, శనివారాల్లో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

ఏపీఐఐసీ స్థలంలో ఆక్రమణల తొలగింపు

❖ పేర్నమిట్టలో ఉద్రిక్తత

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: పేర్నమిట్టలో పొగాకు బోర్డును ఆనుకొని కర్నూల్ రహదారి వెంట ఏపీఐఐసీకి చెందిన సర్వే నెంబర్ 102లోని రోడ్డు వెంట ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. సుమారు 15 ఏళ్ల నుంచి పొగాకు బోర్డు పక్కన ఏపీఐఐసీకి చెందిన స్థలాలను ఆక్రమించి పలువురు ఇళ్లు కట్టుకొని నివాసముంటున్నారు. ఆక్రమణలు తొలగించాలని పలువురు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాలు రావడంతో జేసీ సూచనలతో ఏపీఐఐసీ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పెద్దఎత్తున సర్వే నెం102 ప్రాంతానికి వెళ్లారు. వారు మున్సిపాలిటీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అక్రమ నిర్మాణదారులతో మాట్లాడారు. అనంతరం జేసీబీ సాయంతో ఒక్కో కట్టడాన్ని తొలగించారు. రహదారి పక్కనున్న సుమారు 14 ఇళ్లను, పలు షాపులను కూల్చివేశారు.

పరిహారం ఇవ్వాలంటూ ఆందోళన

పొగాకు బోర్డు దగ్గరి నుంచి ఆంజనేయస్వామి దేవస్థానం వరకు ఉన్న కట్టడాల తొలగింపు సందర్భంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బాధితులు తమ నిరసన వ్యక్తం చేశారు. తాము ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్నామని, ఎలాంటి సమాచారం లేకుండా తొలగింపులు చేపట్టడం సరికాదన్నారు. కనీసం తమకు నష్ట పరిహారం కూడా ఇవ్వకుండా చర్యలు చేపట్టడం ఏమిటంటూ వారిని నిలదీశారు. అధికారులు వారికి సర్దిచెప్పి కార్యక్రమం పూర్తిచేయించారు.



జేసీబీతో ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం

చౌక దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

యర్రగొండపాలెం పట్టణం: యర్రగొండపాలెంలో చౌక దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఒక చౌక దుకాణంపై 6ఏ కేసు నమోదు చేశారు. గురువారం 'ఈనాడు'లో 'అందని కందిపప్పు.. మాయం చేసిన డీలర్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో దుకాణాలపై దాడులు నిర్వహించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో 10వ దుకాణంలో 106 ప్యాకెట్ల కందిపప్పును సీల్ చేశారు. అదనంగా ఉన్న 50 కేజీల బియ్యం, నూనె ప్యాకెట్లను గుర్తించి దుకాణంపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దుకాణం నిర్వహణ బాధ్యతను 6వ దుకాణ డీలర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా చౌకదుకాణాల డీలర్లు అంతా గురువారం కందిపప్పును లబ్ధిదారులకు పంపిణీ మొదలు పెట్టినట్లు డీటీ రాధాకృష్ణ తెలిపారు.



టంగుటూరు : ఎం.నిడమానూరు – కె.ఉప్పలపాడు మధ్య ముసి వాగు ఉద్ధృతి



నాగులుప్పలపాడు : దండువాళ్ల వాగు ధాటికి కోతకు గురైన రహదారి

శాంతించని వాగులు.. వంకలు

న్యూస్‌టుడే బృందం :

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు పడుతుండటంతో జిల్లాలోని వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం జిల్లాను వాన ముంచెత్తడంతో ముసి వాగుకు వరద పోటెత్తింది. ఎం.నిడమానూరు-కె.ఉప్పలపాడు గ్రామాల మధ్య ఉన్న చప్టాపై గురువారం కూడా నీరు పరవళ్లు తొక్కింది. ముండ్లమూరు మండలంలోని మారెళ్ల సమీపంలో ఈదరవాగు వద్ద చప్టాపైనుంచి నీరు ప్రవహిస్తోంది. గత తెదేపా హయాంలో ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. చప్టా కింది భాగంలో వ్యర్థాలు, పూడిక చేరడంతో నీరంతా నిలిచిపోయింది. దీంతో మారెళ్లతో పాటు, మక్కెనవారిపాలెం, జమ్మలమడకవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మారెళ్లకు చెందిన తెదేపా నాయకులు రాఘవరెడ్డి, డాక్టరు వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు జేసీబీతో వ్యర్థాలు తొలగింపజేశారు.

❖ ఒంగోలు మండలం కరవది-గుత్తికొండవారిపాలెం గ్రామాల మధ్య ముదిగొండ వాగు పరవళ్లు తొక్కుతోంది. చప్టా పైనుంచి వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఆ మూడో రోజు కూడా రాకపోకలు నిలిచాయి. కొత్తపట్నం మండలం సంకువానికుంట గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్ద ఉద్ధృతి కొంత మేర తగ్గింది. ఈతముక్కల- ఆలకూరపాడు మధ్య రాకపోకలు నిలిచిపోగా; అత్యవసరమైన వారు మాత్రం చప్టా మీదుగా దాటుతున్నారు.



ఒంగోలు గ్రామీణం : సంకువానికుంట వద్ద పెద్దవాగు ప్రవాహం

❖ నాగులుప్పలపాడు మండలంలోని కొత్తకోట వద్ద, హనుమాపురం వద్ద వాగులు పొంగి ప్రవహించి ఆ మార్గంలోని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మాచవరం-ఉప్పుగుండూరు మధ్య దండువాళ్ల వాగు ఉద్ధృతికి రహదారి కోతకు గురవ్వగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు.

సార్వత్రిక పది, ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

ఒంగోలు నగరం: సార్వత్రిక పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 25 వరకు అవకాశం కల్పించినట్లు విద్యాశాఖ పరీక్షల విభాగం అధికారి శివకుమార్ పేర్కొన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్ పొందవచ్చన్నారు. అపరాధ రుసుం రూ.200తో ఈ నెల 29 వరకు; రూ. వెయ్యి అపరాధ రుసుంతో 31 వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు.

నేడు, రేపు ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 18, 19న ఒంగోలులో పర్యటించనున్నారు. 18న ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఒంగోలులో జరగనున్న స్థానిక కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 130, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

మద్యం మత్తులో భార్య గొంతు కోసిన భర్త

❖ తీవ్ర రక్తస్రావంతో మృతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో భార్యను భర్త కత్తితో గొంతు కోసి హతమార్చాడు. ఈ సంఘటన మండలంలోని ఊళ్లపాలెంలో గురువారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్టా వెంకట్రావు, తిరుపతమ్మ (25) దంపతులు. వారు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వెంకట్రావు మద్యానికి బానిసై నిత్యం భార్యను వేధిస్తున్నాడు. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం మద్యం తాగి ఇంటికొచ్చి భార్యతో ఘర్షణకు దిగాడు. ఆవేశంతో ఇంటిలోని చాకుతో ఆమె గొంతు కోశాడు. రక్తం మడుగులో పడివున్న తిరుపతమ్మను స్థానికులు వెంటనే వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కందుకూరు తరలించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తెదేపా కార్యకర్త దుర్మరణం

❖ మరొకరికి గాయాలు

మార్కాపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తెదేపా కార్యకర్త మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి మార్కాపురంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన తెదేపా క్రియాశీల కార్యకర్త కూరపాటి రాజశేఖర్ సామేలు (37) బుధవారం రాత్రి సౌజన్య కల్యాణ మండపంలో జరిగిన వివాహానికి హాజరైన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికొస్తున్నారు. అదే సమయంలో పదో వార్డుకు చెందిన ఎం.అశోక్ ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో వచ్చి సామేలు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తెదేపా కార్యకర్త సామేలు అపస్మారక స్థితికి చేరగా, అశోక్‌కు గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు సామేలు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి వైద్యశాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు. మృతుడికి భార్య ఎలిజిబెత్ రాణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



మృతుడు రాజశేఖర్

గుండ్లకమ్మలో యువకుడు గల్లంతు

మద్దిపాడు: గుండ్లకమ్మ వాగులో పడి ఓ యువకుడు గల్లంతైన సంఘటన గురువారం రాచవారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాచవారిపాలేనికి చెందిన గంగిశెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు బ్రహ్మానాయుడు మిత్రులతో కలసి గురువారం సాయంత్రం గుండ్లకమ్మ నది ఒడ్డుకు వెళ్లారు. అనంతరం బ్రహ్మానాయుడు పడవ ఎక్కి చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లారు. ప్రవాహ తాకిడికి పడవ బోల్తాపడటంతో ఆయన గల్లంతయ్యారు. స్నేహితులు నది సమీపంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. అతనికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలున్నారు. స్థానిక పోలీసులు, తహసీల్దార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.



బ్రహ్మానాయుడు (పాత చిత్రం)

ఏటీఎం కేంద్రంలో చోరీకి విఫల యత్నం

చీమకుర్తి : చీమకుర్తి ప్రధాన రహదారి ఎన్నెస్పీ కాలనీలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో చోరీకి విఫలయత్నం జరిగింది. గురువారం తెల్లవారుజామున దొంగలు ఏటీఎం కేంద్రం తలుపులు మూసివేసి సీసీ కెమేరాకు రంగు స్ప్రే పిచికారీ చేశారు. అనంతరం నగదు యంత్రాన్ని పగులగొట్టే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా సైరన్ మోగడంతో స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోగా దుండగులు అప్పటికే పరారయ్యారు. ఎలాంటి నగదు చోరీ జరగలేదు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో నగదు అపహరణ

యర్రగొండపాలెం పట్టణం : యర్రగొండపాలెం ఇందిరానగర్‌లో బుధవారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు పడి నగదు దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని ఇందిరానగర్ చర్చి సమీపంలో నివాసముండే రెడ్డిపోగు అబ్రహాం ఇంటి వాకిలి గడియ పెట్టకుండా పడుకున్నారు. రాత్రివేళ దొంగలు ఇంట్లోకి ప్రవేశించి ట్రంక్ పెట్టెలోని రూ. 33,300 నగదు దోచుకెళ్లారు. అబ్రహాం ఫిర్యాదు మేరకు ఎస్సై చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు ఆదేశాలతో ఆరుగురిపై కేసు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలోని ఓ స్థలం విషయంలో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారన్న విషయమై కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు పొదిలి ఎస్సై వి.వేమన తెలిపారు. గురువారం పొదిలి పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పొదిలి కొత్తూరులోని సర్వే నెం.212, 213లో 145 చదరపు గజాల స్థలాన్ని (నాలుగు ప్లాట్లు) 2021లో వెలిశెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వి.ఏడుకొండలు, టి.వెంకట్రావుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అదే స్థలాన్ని 2022లో బెల్లం పద్మజ అనే మహిళ వి.రాజ్యలక్ష్మి, డి.వరలక్ష్మిలకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై వెలిశెట్టి వెంకటేశ్వర్లు ప్రైవేటు కేసు దాఖలు చేయగా, కోర్టు ఆదేశాల మేరకు అప్పటి వీఆర్వో వి.యాకోబు, సర్వేయరు డి.బ్రహ్మం, తహసీల్దార్ టి.దేవప్రసాద్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. అధికారులు జారీచేసిన ధ్రువీకరణపత్రాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

● ౯౦ మందికి నోటీసులు జారీ ● తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

మార్కాపురం, న్యూస్‌టుడే:



మార్కాపురం పట్టణంలోని గడియారస్తంభం కూడలిలో రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు

మార్కాపురం పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. రహదారులను, దానిపై ఉన్న కాలువలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య పెద్దదిగా మారింది. జనాభా పెరగడంతో, వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో రాకపోకలకు కష్టంగా మారింది. నియోజకవర్గ, డివిజన్ కేంద్రంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. దీంతో ఆక్రమణలను తొలగించాలని అధికారులు భావించినా అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు తరుణం ఆసన్నమైంది. మరో మూడు రోజుల్లో ఆక్రమణలకు తొలగింపునకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. దీంతో కొంత వరకు మార్కాపురం పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకనుంది. ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువను దాటి ఆక్రమించిన 90 మంది వ్యాపారులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. స్వచ్ఛందంగా వారి ఆక్రమణలను వారే తొలగించుకోవాలని తెలిపారు. మూడు రోజుల్లోపు తొలగించకపోతే తామే తొలగించడానికి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండో విడతగా మరో కొంత మందికి నోటీసులు జారీ చేయనున్నారు.

డిపో నుంచి పూలసుబ్బయ్య కాలనీ వరకు..

పట్టణంలోని ప్రధాన రహదారి ఆర్టీసీ డిపో దగ్గర నుంచి పూలసుబ్బయ్యకాలనీ వరకు ఉన్న రహదారికి ఇరువైపులా ఉన్న కాలువను దాటి రహదారులపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మరి కొంత రహదారిపైనే బండ్లు పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. మార్కాపురం- కళాశాల రహదారిలో ఇటీవల అట్టహాసంగా ప్రారంభించిన పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ కూడా వాటి వెనుకవైపు కాలువ ఆక్రమించి బుకింగ్ కౌంటర్లు, వస్తువులను భద్రపరిచే కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. మాల్స్ ముందు ఐస్‌క్రీం బండ్లు, జ్యూస్ బండ్లు వెలశాయి.. ఇలాంటి ఆక్రమణలను అధికారులు తొలగించనున్నారు.

పట్టణాభివృద్ధి సహకరించండి



పట్టణం అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతున్నాం. ఇప్పటికే రహదారులు అన్ని చిన్నవిగా మారిపోయాయి. ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకోబోతున్నాం.

– నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

మార్కాపురం

● మార్కాపురం ● గిద్దలూరు ● యర్రగొండపాలెం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కంభం, న్యూస్‌టుడే: పట్టణంలోని అంకాలమ్మ తిప్ప ప్రాంతంలో నివాసం ఉండే భవన నిర్మాణ కార్మికుడు రంగస్వామి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందాడు. మండల భవన నిర్మాణ కార్మికులు గురువారం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 22,500 ఆర్థిక సాయం అందజేశారు. రంగస్వామితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఈ-పంట జాబితా ప్రదర్శన

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మేడపి రైతు సేవా కేంద్రంలోఖరీఫ్ ఈ-పంట జాబితా సామాజిక తనిఖీ కోసం గురువారం గ్రామంలో ప్రదర్శించారు. సర్వే నెంబర్ల వారీగా రైతుల పేర్లతో పంట నమోదు చేశామని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 18లోగా అందిస్తే సరి చేస్తామని ఏవో మస్తాన్ నాయక్ తెలిపారు.



కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పైరు

మొక్కజొన్న.. ముంచేస్తుందా!

☛ ధరల పతనంతో ఆందోళన ☛ మరో వైపు వర్షంతో గుబులు

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందివచ్చే సమయంలో ధరలు పతనమవుతున్నాయి. నియోజకవర్గంలోని బేస్తవారపేట, రాచర్ల, కంభం తదితర మండలాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. మరో పది రోజుల్లో చేతికి అందివచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కర్షకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, కంభం

వర్షాలు కురుస్తుండటం, మరికొన్ని రోజుల్లో పంట చేతికి వస్తుండడంతో వ్యాపారులు ధరలు తగ్గించారు. ప్రస్తుతం క్వింటా రూ. 2200 అడుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. 20 రోజుల కిందట క్వింటా రూ. 2,800 నుంచి రూ. 2900 వరకూ ధర పలికింది. ధరలు పతనం కావడం, ఈ ధరైనా ఉంటుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. 20 రోజుల వ్యవధిలోనే రూ. 800 మేర తగ్గడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సేద్యాలు, కూలీలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కోత ఖర్చులు తదితర వాటికి ఎకరానికి సుమారు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకూ పెట్టుబడి పెట్టారు.

మద్దతు ధర ఏదీ

ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో కర్షకులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. ఈ సారి దిగుబడి తగ్గిందని, ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఈ సంవత్సరం 20 నుంచి 25 క్వింటాళ్ల మధ్యే వస్తోందని తెలిపారు. అధికారులు స్పందించి ధరలు తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

తగ్గిస్తే ఎలా..?



ఎంతో కష్టపడి పంటను పండించాం. రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పెట్టుబడి రూ. 60 వేల వరకూ అయ్యింది. పైరు చేతికి అందివచ్చిన తర్వాత రేట్లు తగ్గిస్తే ఎలా ?. ఎంతో పెట్టుబడి పెట్టాం. సుమారు నెల కిందట రూ. 3 వేల ధర పలికాయి. ఇంతలోనే ధర తగ్గాయని చెబుతున్నారు. వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర పెంచి కొనుగోలు చేయాలి. లేకపోతే నష్టాలపాలవుతాం.

– తిరుపతయ్య, రైతు, అక్కపల్లి, బేస్తవారపేట మండలం



మిరప పొలంలో నిలిచిన నీరు

పొలాల్లోనే వరద

❑ తొలగించకపోతే నష్టమే.. ❑ దెబ్బతింటున్న పంటలు

కంభం, బేస్తవారపేట, త్రిపురాంతకం గ్రామీణం: బేస్తవారపేట మండలంలో సుమారు 80 ఎకరాల్లో మిరప పంట దెబ్బతింది. పొలాల్లో నీరు నిలిచి ఉంది. జెన్నివారిపల్లి, బసినేపల్లి, చెరుకుపల్లి, అక్కపల్లి గ్రామాల్లో సాగు చేసిన మిరప పంట దెబ్బతింది. పూసలపాడు, చెట్టిచర్ల గ్రామాల్లో మిరప పంటను క్షేత్రస్థాయిలో ఉద్యానశాఖ అధికారిణి శ్వేత పరిశీలించారు. పొలాల్లోని మొక్కలు ఉరకెత్తకుండా రైతులు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ● త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెం, విశ్వనాథపురం, వెల్లంపల్లి పొలాల్లో సాగులోని మిర్చి, వరి పంటలను ఏవో కె.నీరజ గురువారం పరిశీలించారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున లోతట్టు పొలాల్లో సాగు చేసిన మిర్చి పంటలో నీరు చేరిందున యూరియా, పొటాష్, మెగ్నీషియం పిచికారీ చేసుకోవాలని ఆమె సూచించారు. వరి పంట పెరుగుదల దశలో ఉన్నందున వీలైనంత త్వరగా నీటిని బయటకు పంపాలని తెలిపారు.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

పొదిలి గ్రామీణం: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను గురువారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మండలంలోని కొండాయపాలెం గ్రామంలో పర్యటించిన ఆయన సజ్జ, కంది, మిరప, పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం వ్యవసాయాధికారి జైనులాబ్దీన్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా భారీ వర్షాలకు సజ్జ కంకులు మొలకలు రావడంతో పంట పనికిరాకుండా పోయి, తీవ్రంగా నష్టపోయామని రైతులు నారాయణ రెడ్డికి తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పంట నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు.



పూసలపాడులో మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి శ్వేత



కొండాయపాలెంలో సజ్జ పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



నల్లగా మారిన పూలు

పాడైన బంతి తోట

కంభం : చిన్నకంభం పంచాయతీకి చెందిన నరేష్ ఎకరం పొలంలో బంతి పూలు సాగు చేశారు. నాలుగు రోజులుగా వానలు కురవడంతో పువ్వులు పాడైపోయి నల్లగా మారాయి. సుమారు రూ. లక్ష మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.



అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

అప్రమత్తత అవసరం

గిద్దలూరు పట్టణం: మార్కాపురం డివిజన్ సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ గిద్దలూరు మండలంలోని సగిలేరును పరిశీలించారు. ప్రస్తుతం సగిలేరులో నీటి ప్రవాహం ఎలా ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

మార్కాపురం పట్టణం,పొదిలి, గిద్దలూరు పట్టణం, బేస్తవారపేట, పెద్దదోర్నాల. యర్రగొండ పాలెం పట్టణం, : వాల్మీకి జయంతి సందర్భంగా భాజపా నాయకుల ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని విద్యుత్తు కార్యాలయం వద్ద డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● పొదిలి శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె. శాంసన్ ఆధ్వర్యంలో పాఠకులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి స్మరించుకున్నారు. ● గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నివాసగృహంలో తెదేపా నాయకులు వాల్మీకి జయంతి నిర్వహించారు. ● బేస్తవారపేటలోని ఓబులరెడ్డి కళాశాల ఆవరణలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి మోక్షగుండం హోమియోపతి వైద్యశాల వైద్యుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని వాల్మీకి విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ● యర్రగొండపాలెం పి.ఆర్.శాఖ అతిథి గృహం ఆవరణలో వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు హాజరై వాల్మీకి గొప్పతనాన్ని తెలియజేశారు.



పెద్దదోర్నాలలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సై మహేష్, వాల్మీకి సంఘం నాయకులు



యర్రగొండపాలెంలో : వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313

గిద్దలూరు పట్టణం: 8008574135

యర్రగొండపాలెం : 8008552658

పొదిలి : 8008550360

కంభం : 8008632343

కంభం, న్యూస్‌టుడే:



సమస్య: స్థానిక పంచాయతీలోని అర్బన్ కాలనీలోని ప్రధాన రహదారి గుంతలమయంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా అధ్వానంగా మారుతోంది. రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. రోడ్డును బాగు చేయించాలి.– వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాధానం: రహదారిని పరిశీలించి, సర్పంచితో మాట్లాడి బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కంభం

సులభ్ కాంప్లెక్స్ కూల్చివేసిన వారిపై చర్యలకు డిమాండ్

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పెద్దబస్టాండ్‌లో సులభ్ కాంప్లెక్స్‌ను నేలమట్టంచేసి ఆ స్థలాన్ని కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సులభ్ కాంప్లెక్స్ నిర్వాహకుడు షేక్ మహబుబ్‌సుభాని కోరారు. 2010లో గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చిన స్థలంలో రూ.3 లక్షలు వెచ్చించి సులభ్ కాంప్లెక్స్ నిర్మించామన్నారు. అప్పటి నుంచి నిర్వహణ చేస్తున్నామని, వెనుక స్థలం వ్యక్తులు ఇప్పటికే మూడుసార్లు సులభ్ కాంప్లెక్స్‌ను పగులగొట్టి అక్కడ పనిచేసేవారిని బెదిరించారని చెప్పారు. ఈ విషయమై అప్పట్లో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అధికారులు వారిపై రెండుసార్లు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కొండేపల్లి దారిలో ప్రయాణం నరకయాతనే



అధ్వానంగా మారిన కొండేపల్లి రహదారి

మార్కాపురం, న్యూస్‌టుడే : మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రహదారితో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి రహదారిపై ఏర్పడిన భారీ గుంతల్లో వర్షం నీరు చేరింది. గుంతల్లో చేరిన నీటితో ఎక్కడ ఎంత లోతునా గుంతలు ఉన్న విషయం తెలియని ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో గుంతల్లో పడిపోతున్నారు. పట్టణంలోని వడ్డెబజారు దాటిన తర్వాత రహదారి అధ్వానంగా మారిపోయింది. వంతెన దాటిన తర్వాత ఎన్.ఎస్. నగర్‌లోకి వెళ్లే రహదారి గుంతమయంగా మారింది. నిత్యం నీళ్లు నిలిచి ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సంవత్సరాలుగా అనుభవిస్తున్నామని, గత వైకాపా ప్రభుత్వం కనీసం రహదారి కూడా నిర్మాణం చేపట్టలేదని కూటమి ప్రభుత్వం అయినా సీసీ రహదారిని నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గిద్దలూరు : డిప్యూటీ తహసీల్దారు రామనారాయణరెడ్డిని సన్మానిస్తున్న వీఆర్వోలు



పెద్దదోర్నాల: ఈవో మోహనరావును సన్మానిస్తున్న సర్పంచి, అధికారులు, నాయకులు

బాధ్యతల స్వీకరణ



బి.శ్రీనివాసులు మార్కాపురం ఎంపీడీవో

మార్కాపురం: మార్కాపురం మండలం ఎంపీడీవోగా బి. శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రాపురం కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో ఈవోఆర్డీగా వచ్చారు. ఈవోఆర్డీ నుంచి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

● గిద్దలూరు పట్టణం: గిద్దలూరు తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారుగా సూరా రామనారాయణరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను జిల్లా వీఆర్వో సంఘం అధ్యక్షుడు వై.పి. రంగయ్య ఆధ్వర్యంలో వీఆర్వోలు శాలువా కప్పి సన్మానించారు.

● పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ ఈవోగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న మోహనరావును ప్రజాప్రతినిధులు, వైకాపా, తెదేపా నాయకులు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆయన రాయవరం పంచాయతీ కార్యదర్శిగా, మార్కాపురం ఇన్‌ఛార్జి ఈవో ఆర్డీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

తర్లుపాడు నూతన ఎంపీడీవోగా చక్రపాణి ప్రసాద్

తర్లుపాడు: ఎట్టకేలకు తర్లుపాడు మండలానికి నూతన ఎంపీడీవోను ప్రభుత్వం నియమించింది. గుంటూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎం. కె. చక్రపాణి ప్రసాద్ తర్లుపాడు నూతన ఎంపీడీవోగా గురువారం వచ్చి బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో పదవీరమణ చేయడంతో ఇప్పటి వరకు డిప్యూటీకి తాత్కాలిక బాధ్యతలను అప్పజెప్పిన ఉన్నతాధికారులు ఎట్టకేలకు శాశ్వత ఎంపీడీవోను నియమించారు.



తర్లుపాడు: నూతన ఎంపీడీవో చక్రపాణికి స్వాగతం చెబుతున్న సిబ్బంది



తర్లుపాడు : మేకలవారిపల్లెలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పల్లె పండగతో గ్రామాభివృద్ధికి శ్రీకారం

పొదిలి గ్రామీణం, తర్లుపాడు, కొమరోలు, మార్కాపురం, యర్రగొండపాలెం పట్టణం: పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా పొదిలి మండలంలోని కొండాయపాలెం, కుంచేపల్లి, ఈగలపాడు గ్రామాల్లో, తర్లుపాడు మండలంలోని మేకలవారిపల్లెలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి గురువారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.● కొమరోలు మండలంలోని ముత్రాసుపల్లె, అయ్యవారిపల్లె, రౌతుపల్లె, మదవపల్లె గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలీ భూమి పూజ నిర్వహించారు.● మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో సీసీ రహదారికి డీఎల్‌పీవో వై.భాగ్యవతి, ఎంపీడీవో శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు.● యర్రగొండపాలెం మండలంలోని నర్సాయపాలెం, బోయలపల్లె గ్రామాల్లో సీసీ రోడ్లకు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శంకుస్థాపన చేశారు.



యర్రగొండపాలెం: నర్సాయపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎరిక్షన్‌బాబు

పొదిలిలో ద్విచక్రవాహనం చోరీ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి చిన్నబస్టాండ్ సమీపంలో రాత్రిపూట ఇంటి ముందు పెట్టిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసినట్లు వాహన యజమాని పి.సురేష్‌కుమార్ తెలిపారు. వాహనాన్ని రాత్రిపూట ప్రతిరోజు ఇంటి ముందే పెట్టుకుంటామని, ఉదయం లేచి వాహనం చూస్తే కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికామని పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కంభం: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక వై జంక్షన్, బస్టాండ్, కందులాపురం కూడలి ప్రాంతాల్లో గురువారం వాహనాలు తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేని 20 మంది వాహనదారులు, మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తికి అపరాధ రుసుం విధించారు.

మూడోరోజూ కొనసాగిన దీక్ష

మార్కాపురం పట్టణం: మున్సిపాలిటీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్-సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని ఆయన కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డీకెఎం. రఫీ, యూనియన్ నాయకులు కె.సుబ్బరాయుడు, హరి, ఎస్‌కె. షబ్బీర్, రమణ, యూసఫ్, అల్లూరయ్య పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

బేస్తవారపేట: బేస్తవారపేట మండలంలోని నేకునాంబాద్ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రాయితీపై అందిస్తున్న శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఏవో మెర్సీతో కలిసి ఆయన పరిశీలించారు.

రంగనాయకస్వామికి విశేష పూజలు

కంభం, న్యూస్‌టుడే : పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక సంగా వీధిలో కొలువైన రంగనాయకస్వామి వారికి గురువారం రాత్రి విశేష పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. మేళతాళాలతో స్వామివారి ఉత్సవం నిర్వహించారు

ఎడతెరిపి లేని వర్షాలతో.. ఇక్కట్లు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: అల్పద్రోణి కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు యర్రగొండపాలెం పట్టణంలోని అన్ని బజారులలో అపరిశుభ్రత నెలకొంది. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే వర్షపు నిలిచి రోడ్లన్నీ శిథిలమైపోతున్నాయి. అయిదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొన్ని వీధులు బురదమయంగా మారుతున్నాయి. దీంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో మసీదు వీధి నీరు నిలిచి అపరిశుభ్రంగా మారిపోయింది. తపాలా కార్యాలయం బజారు, దాని వెనక బజరులలో నీరు నిలిచి నడిచే వీలు లేకుండా మారిపోయింది. కొన్ని వీధుల్లో నడిస్తే దిగబడే పరిస్థితి నెలకొంది. శివాలయం బజారు, ఎన్జీవో కాలనీ బజారు తదితర వీధులు బురదమయంగా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు బయటి రాలేక వస్తే మురికి వీధుల్లో నడవ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ వారు నీరు నిలువకుండా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి డ్రైనేజితో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




నీరు నిలిచి అసౌకర్యంగా మారిన తపాలా కార్యాలయం బజారు



ఇందిరానగర్ మసీదు బజారు దుస్థితి ఇదీ..

వైద్యశాల ప్రాంగణం బాగుకు అర్జీ

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వంద పడుకల వైద్యశాల ప్రాంగణాన్ని బాగు చేయాలని భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏనుముల నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు సూర్య నారాయణ గురువారం సబ్ కలెక్టర్ వెంకటత్రివినాగ్‌ను కోరారు. ఈ సందర్భంగా మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి అర్జీ అందజేశారు. వైద్యశాల ప్రాంగణం వర్షం వస్తే చిత్తడి మారి రోగులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే చర్యలు చేపట్టి సిమెంట్ తో కాంక్రీట్ పర్చాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను శాలువతో సన్మానించారు.



సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్‌కు అర్జీ అందిస్తున్న భాజపా నాయకులు

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

సమస్య: సింగరాయకొండలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. స్థానిక ప్రశాంతి సినిమా హాలు ఎదురు వీధిలో పిచ్చి కుక్క ఇద్దరిని గాయపరిచింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. –పద్మజ, సింగరాయకొండ

సమాధానం: వీధి కుక్కలను దూరప్రాంతాలకు తరలించేందుకు పంచాయతీలో తీర్మానం చేసి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. –జగదీష్, పంచాయతీ కార్యదర్శి

కనిగిరిలో ఉచిత మెగా వైద్య శిబిరం

కనిగిరి: పట్టణంలోని అమరావతి మైదానంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జననీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత మోకాళ్ల, కీళ్ల మార్పిడి వైద్య శిబిరం నిర్వహించారు. 224 మందికి వైద్యులు ఇంద్రప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, పరీక్షలు నిర్వహించారు. వీరిలో 60 మందికి శస్త్రచికిత్సలు అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ.. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి విడతల వారిగా గుంటూరు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి రాయితీలు

మద్రిపూడి: చిన్న, సన్నకారు రైతులు పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని ఎంపీడీవో జగదీష్ సూచించారు. మద్రిపూడిలో ఉపాధిహామీ పథకంలో రాయితీపై అందజేసిన బత్తాయి మొక్కలను గురువారం ఆయన పరిశీలించారు. పండ్ల తోటల పెంపకానికి ఈ పథకంలో రాయితీ ఇవ్వనున్నట్లు వివరించారు. ఏపీవో రాంబాబు పాల్గొన్నారు.



కనిగిరి: వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి తదితరులు

వాల్మీకి మహర్షి జయంతి

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వేంకటేశ్వర దేవస్థానం సమీపంలోని వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి సంఘం నాయకులు గడ్డినరసింహులు, మండ్లా శ్రీనివాసులు, ఇరపని సుబ్బారావు, నారాయణమ్మ, సుచరిత, మాలకొండయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

● **పామూరు:** వాల్మీకి జయంతి వేడుకలను స్థానిక తెదేపా కార్యాలయంలో కూటమి నాయకులు నిర్వహించారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహరావు, ఇర్రి కోటిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, మండ్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ● **ముండ్లమూరు:** మండలంలోని పూరిమెట్లలో వాల్మీకి సంఘం నాయకులు ఆధ్వర్యంలో రామాలయం వద్ద వాల్మీకి మహర్షి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోడిగ మస్తాన్‌రావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాత కష్టం.. వర్షార్పణం

● సజ్జ, పొగాకు, మిర్చి, పత్తి పంటలకు నష్టం ● ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుల వేడుకోలు

అకాల వర్షాలు అన్నదాతలను నిలువునా ముంచేశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల్లో విస్తారంగా వానలు కురిశాయి. ఎంతో ఆశతో పంటలు సాగు చేసిన అన్నదాతలు, తీరా పంట చేతికొచ్చే సమయంలో పూర్తిగా దెబ్బతినడాన్ని చూసి లబోదిబోమంటున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కనిగిరి, తాళ్లూరు, దర్శి, ముండ్లమూరు, కురిచేడు

కనిగిరి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఆరు మండలాల్లో 4,175 ఎకరాల్లో రైతులు సజ్జ పంట సాగు చేయగా.. రెండు వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వెలిగండ్ల, కనిగిరి, పామూరు, పీసీపల్లి మండలాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న సజ్జ పైరుతో పాటు కళ్లాల్లో ఉంచిన కంకులు సైతం మొలకెత్తాయి. ఒక్క గింజ చేతికి వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● దర్శి మండలంలో దాదాపు 800 హెక్టార్లలో పత్తి, 350 హెక్టారుల్లో పొగాకు సాగు చేశారు. కాయలు పగిలి పత్తి తీసే సమయం కావడంతో వర్షాలకు తడిసిపోయింది. నల్లగా మారి పనికిరాకుండా పోతుందని రైతులు చెబుతున్నారు. పొగాకులో నీరు నిలిచి మొక్కలు వాడిపోతున్న పరిస్థితి. సజ్జ కంకుల నుంచి మొలకలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ● తాళ్లూరు మండలంలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వరి చేలు మొత్తం నేలవాలడంతో గింజలు మొలకలెత్తాయి. మల్కాపురం కేవీపాలెం వద్ద పొగాకు పంట ఉరకలెత్తే పరిస్థితులు ఏర్పడ్డాయి. మాధవరానికి చెందిన ఓ రైతు గుంటి గంగ వద్ద బొప్పాయి పంట సాగు చేయగా దానిలోనూ అధికంగా నీరు నిలిచిపోయింది. ● ముండ్లమూరు మండలంలోని కెల్లంపల్లి, పెదఉల్లగల్లు, పసుపుగల్లు, మారెళ్ల, పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం, ముండ్లమూరు, తమ్మలూరు, వేంపాడు, తూర్పుకంభంపాడు, శంకరాపురం, పోలవరం తదితర గ్రామాల్లో రైతులు సజ్జ పంట సాగు చేశారు. వర్షం పూర్తిగా దెబ్బతినిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● కురిచేడు, పొట్లపాడు, పేరంబొట్లపాలెం, ఆవులమంద, పడమర నాయుడుపాలెం, ఎం. గంగవరం, పెద్దవరం గ్రామాల్లో మిర్చి, పొగాకు, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. నీరు నిలిచి మొక్కలు వాడుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



తాళ్లూరు: గుంటిగంగ సమీపంలో బొప్పాయి తోటలో నిలిచిన వర్షపునీరు

రూ.3.5 లక్షలు పెట్టుబడి పెట్టాం..



ఇరవై ఎకరాల్లో సజ్జ పంట సాగు చేశాం. భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. కోతకోసి కళ్లంలో వేసినవి, పొలంలో కోయకుండా ఉన్నవి కూడా తడిసి పోయాయి. దీంతో పంట చేతికి అందే పరిస్థితి లేదు. రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టాం. అవి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తడిసిపోయిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. – ఎన్.రామారావు, కెల్లంపల్లి, ముండ్లమూరు మండలం

పది ఎకరాల్లో పంట దెబ్బతింది



పది ఎకరాల్లో సజ్జ సాగు చేశా. తుపాను కారణంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కళ్లాల్లో ఉన్న సజ్జ కంకులన్నీ తడిసి ముద్దయ్యాయి. మొత్తం కంకులు మొలకెత్తాయి. వీటిని ఇప్పుడు ఎవరూ కొనుగోలు చేయరు. ప్రభుత్వం స్పందించి అధికారులతో పరిశీలన చేయించి కొనుగోలు చేయాలి. – వెంకటరెడ్డి, వాగుపల్లి, కనిగిరి మండలం

ఎకరాకు రూ.25 వేల వరకు నష్టం...



పది ఎకరాల్లో పత్తి సాగు చేశాం. ఎకరాకు 2 నుంచి 3 క్వింటాల పత్తి వచ్చే సమయంలో కురిసిన వర్షాలకు పూర్తిగా పంట దెబ్బతింది. చేతికి అందొచ్చిన ఫలసాయం అందకుండా పోయింది. ఎకరానికి రూ.25 వేల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే ఆదుకోవాలి. - రోశయ్య, బసిరెడ్డిపల్లి, దర్శి మండలం

టార్పాలిన్ పట్టలు ఇచ్చి ఉంటే..



మేము 8 ఎకరాల్లో సజ్జ సాగు చేశాం. వర్షం రాక ముందుకు కోత కోసి కళ్లంలో గోతాలతో కప్పి ఉంచాం. వారం రోజులుగా కురిసిన వర్షాలకు పట్టల్లోంచి నీరు మొత్తం కంకుల్లో చేరి మొలకెత్తాయి. రూ. 80 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. గత ప్రభుత్వం టార్పాలిన్ పట్టలు సరఫరా చేసి ఉంటే ఉన్నంతలో కాపాడుకునేవాళ్లం.

– కుమ్మరికుంట సురేష్, పాపిరెడ్డిపల్లి

వరి చేను నేలమట్టం..



ఒకటిన్నర ఎకరా పొలంలో బీపీటీ రకం వరి పంట సాగు చేపట్టాం. సుమారు రూ.నలభై వేల వరకు పెట్టుబడి పెట్టాం. ప్రస్తుత భారీ వర్షాల వల్ల చేనంతా పూర్తిగా నేల వాలింది. ఆనక వరి కంకుల నుంచి మొలకలు కూడా వచ్చాయి. ఇక గింజకూడా చేతికి వచ్చే అవకాశం లేదు. పెట్టుబడులన్నీ వర్షార్పణమే. ఈ-క్రాప్ గురించి కూడా తెలియక పోవ డం వల్ల తొలుత ఈక్రాప్ కూడా చేయించలేదని, ఉన్నతాధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని విన్నవించాడు. –టి.శివనాగిరెడ్డి, రైతు, తాళ్లూరు

బూజుపట్టి రంగు మారాయి..



మూడు ఎకరాల్లో సజ్జ సాగు చేశాం. వర్షానికి ముందే పంట కోశాం. పూర్తిగా తడిసిపోవడంతో కంకుల్లోని గింజలన్నీ మొలకలు వచ్చాయి. దీని కారణంగా పంట చేతికందే పరిస్థితి లేదు. బూజుపట్టి నల్లగా మారాయి. ఎవరూ కొనేగోలు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తడిసిన, మొలకెత్తిన సజ్జలను రైతుల నుంచి కొనుగోలు చేసి ఆదుకోవాలి. - జి.చంద్రయ్య, రైతు, కెల్లంపల్లి

పోతుల రంగయ్యకు నివాళి

టంగుటూరు: రైతు నాయకుడు పోతుల రంగయ్య జయంతిని టంగుటూరులోని ఎస్ఎల్‌టీసీలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు రైతులు, కూలీల అభ్యున్నతికి రంగయ్య ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోతుల నరసింహారావు, వెంకటేశ్వర్లు, నాగశ్రీను, కసుకుర్తి శ్రీధర్, చిన్న సుబ్బానాయుడు, తులసీరావు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

వెలిగండ్ల, న్యూస్‌టుడే: సజ్జ రైతులను ఆదుకుంటామని ఏడీఏ ఇ.వి.రమణ తెలిపారు. గురువారం మండలంలో రాళ్లపల్లి, పాపిరెడ్డిపల్లి, కంకణపాడు, రాళ్లపల్లి తదితర ప్రాంతాల్లో వర్షానికి దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే అత్యధికంగా సజ్జ సాగు చేసే ప్రాంతం వెలిగండ్ల మండలం అన్నారు. కంది కొన్ని చోట్ల మునకలో ఉందన్నారు. వ్యవసాయాధికారి రంగకృష్ణ, ఈవోఆర్డీ అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

◗ **ముండ్లమూరు:** వర్షాలకు తడిసిన సజ్జ పంటను వ్యవసాయాధికారులు గురువారం పరిశీలించారు. ఒంగోలు డీడీఏ సుబ్రహ్మణ్యం, దర్శి ఏడీఏ బాలాజీనాయక్‌లు మండలంలోని కెల్లంపల్లి, పెదఉల్లగల్లు గ్రామాల్లో పర్యటించారు. మొక్కలు మొలిచిన కంకులను అధికారులకు రైతులు చూపించి తమను ఆదుకోవాలని కోరారు. రెండు గ్రామాల్లో సుమారు 300 క్వింటాళ్ల కంకులు నుంచి మొలకలు వచ్చినట్లు ఏవో ఫరూక్ తెలిపారు. మద్దతు ధర రూ.2,625 ఉందని అంతే ధరకు ప్రభుత్వం తడిసిన సజ్జ పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

◗ **పామూరు:** అధిక వర్షాలకు మిరప పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన అధికారిణి కె.కుసుమ తెలిపారు. మండలంలోని వగ్గంపల్లిలో మిరప పంటను ఆమె పరిశీలించారు. ◗ **హనుమంతునిపాడు:** మండలంలో 5,556 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మినుము, సజ్జ, అలసంద పైర్లలో నీరు నిలిచిపోయింది. తిమ్మారెడ్డిపల్లిలో సజ్జ కంకి దశలో మొలకెత్తాయి. మొలకెత్తిన సజ్జ పంటలను మండల వ్యవసాయ అధికారి రమణ ఆధ్వర్యంలో పరిశీలించారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ముండ్లమూరు: మొలకలొచ్చిన సజ్జ కంకులను పరిశీలిస్తున్న డీడీఏ సుబ్రహ్మణ్యం, ఏడీఏ బాలాజీనాయక్ తదితరులు

తాళం పగలగొట్టి.. విద్యుత్తు కార్యాలయం తెరిచి

దర్శి, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉద్యోగి, విద్యుత్తు కార్యాలయానికి భవనం అద్దెకిచ్చిన యజమానికి మధ్య చోటుచేసుకున్న వివాదంతో ఆ కార్యాలయం మూతపడింది. మూడు రోజుల క్రితం యజమానులు తాళం వేయగా.. వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడ్డారు. యజమానులకు నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేకపోవటంతో చివరకు విధులకు ఆటంకం కలిగించారనే కారణంతో యజమానులపై కేసు పెట్టి, పోలీసుల సమక్షంలో గురువారం కార్యాలయం తెరిచారు. వివరాల్లోకెళితే.. దర్శిలోని పొదిలి రోడ్డులో రవికృష్ణ, ప్రసన్న దంపతులకు చెందిన భవనాన్ని గత ఏప్రిల్ నుంచి విద్యుత్తు కార్యాలయానికి అద్దెకు ఇచ్చారు. అందుకు సంబంధించిన అగ్రిమెంట్ తీసుకునే సమయంలో జేఏవో వేణుగోపాల్ తమ ఇల్లు, స్థలానికి చెందిన ఒరిజినల్ పత్రాలు తీసుకోవడంతో పాటు ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకున్నారని యజమానులు ఆరోపిస్తున్నారు. ధ్రువ పత్రాలను జిరాక్స్ తీసుకుని పలుమార్లు అడిగిన అనంతరం వాటిని సదరు ఉద్యోగి యజమానులకు ఇచ్చారు. ఈ క్రమంలో తాను స్థలానికి నాలుగు సార్లు రూ.కోటి నగదు చెల్లించి అగ్రిమెంట్ రాయించుకున్నానని, రిజిస్ట్రేషన్ చేయడం లేదని న్యాయవాది ద్వారా వేణుగోపాల్ యజమానులకు నోటీసులు పంపించారు. తమకు ఎలాంటి నగదు చెల్లించలేదని, తమ స్థలం కొట్టేయడానికే తమ వద్ద తీసుకున్న ఖాళీ పత్రాలపై అగ్రిమెంట్ రాసుకుని మోసం చేస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని యజమానులు విద్యుత్తు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి గత సోమవారం అధికారులు దర్శి వచ్చి అంతర్గత విచారణ చేపట్టారు. వారి నివేదిక ఆధారంగా ఉద్యోగిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం అద్దె చెల్లించడం లేదని కార్యాలయానికి తాళం వేశారు.



పోలీసు పర్యవేక్షణలో విద్యుత్తు కార్యాలయ తాళం తీస్తున్న సిబ్బంది

ఉద్యోగిపై విచారణ చేపట్టాం..

యజమానికి, ఉద్యోగికి మధ్య ఏం జరిగిందో తెలియదని, విచారణ జరుగుతోందని.. దాని ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఈ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యాలయం తెరిచిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిమెంట్ ప్రక్రియ ఆలస్యం కావడంతోనే భవన యజమానులకు అద్దె చెల్లించడంలో జాప్యం జరిగిందని, త్వరలో చెల్లిస్తామని తెలిపారు. జేఈవో వేణుగోపాల్ అధికారుల అప్రూవల్ లేకుండా మెడికల్ లీవ్‌లో ఉన్నారని ఎస్ఈ తెలిపారు.

దుకాణాల నుంచి మద్యం తరలింపు

దొనకొండ, న్యూస్‌టుడే: గతంలో ఉన్న మద్యం దుకాణాల్లోని సరకు పరిశీలించి అందులో పని చేస్తున్న సిబ్బంది వద్ద వివరాలు తెలుసుకుని స్టాక్‌ను మార్కాపురం డిపోకు తరలిస్తున్నామని దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు. దొనకొండలో 2, చందవరంలో 1 మద్యం దుకాణాల వద్దకు సిబ్బందితో వచ్చి లెక్కలు చూసి వాటిని లారీలో తరలించారు.

22 సీసాల పట్టివేత.. వృద్ధురాలిపై కేసు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని 565 జాతీయ రహదారి కూడలిలో అక్రమంగా తీసుకెళుతున్న 22 మద్యం సీసాలను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. తూర్పుకట్టకిందపల్లికి చెందిన ఓ వృద్ధురాలు మద్యం సీసాలను విక్రయించేందుకు తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

◗ పామూరులోని మదన వేణుగోపాలస్వామి ఆలయాన్ని గురువారం ఎస్సై టి.కిషోర్‌బాబు సందర్శించారు. ఆలయంలో సీసీ కెమెరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవో ఎస్.నరసింహబాబు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

కనిగిరి, న్యూస్‌టుడే: ప్రతి బ్యాంకులో అలారాలు, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై శ్రీరామ్ తెలిపారు. గురువారం పట్టణంతో పాటు మండలంలోని ఉన్న జాతీయ బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడారు. ఏటీఎం వద్ద రాత్రి పూట సెక్యూరిటీ ఉండేలా చూడాలన్నారు. బ్యాంకులకు ఎక్కువ రోజులు సెలవులుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణంలోని 11 బ్యాంకులకు నోటీసులు అందజేశారు.



తాళ్లూరులోని పారువేట వద్ద బురదమయమైన రహదారి

జారుడు బల్లల్లా.. మట్టి రోడ్లు

వర్షాలకు గ్రామాల్లోని మట్టిరోడ్లు జారుడుబల్లలా మారాయి. తాళ్లూరు శివారు పారువేట వద్ద అడుగడుగునా గుంతలేర్పడ్డాయి. భారీ వర్షాలకు నీరు రహదారిపై నిలిచిపోయి బురదమయమైంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కె.సుందరరామయ్యను వివరణ కోరగా.. వెంటనే పరిశీలించి వీలైనంత త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అలాగే దర్శి మండలం సామంతపూడి రహదారి వర్షాలకు చిత్తడిగా మారింది. –న్యూస్‌టుడే, తాళ్లూరు, దర్శి



దర్శి మండలం సామంతపూడిలో చిత్తడిగా మారిన రోడ్డు

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. సి.ఎస్.పురంలో గురువారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.3 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న 13 సిమెంట్ రహదారుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైకాపా అయిదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సి.శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో షేక్ ఖాదర్‌బీ, తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి, ఏఈఈ బి.బ్రహ్మయ్య, కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి, సర్పంచి ఎస్.పద్మావతి, ఉప సర్పంచి పి.నరసయ్య, భాజపా నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ● **పీసీపల్లి:** పీసీపల్లి, నేరుడుపల్లి గ్రామాల్లో సిమెంట్ రహదారులు, పీసీపల్లి నుంచి జంగాలపల్లి వెళ్లే రోడ్డు కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి భూమిపూజ నిర్వహించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీడీవో ప్రభాకర్‌శర్మ, మండల తెదేపా అధ్యక్షుడు వేమూరి రామయ్య పాల్గొన్నారు. ● **తాళ్లూరు:** మండలంలోని విఠలాపురంలో నాలుగు చోట్ల సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుందరరామయ్య, ఏపీవో మురళి, కార్యదర్శి అజయ్ కీర్తి, మండల తెదేపా అధ్యక్షుడు ఓబులరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



తాళ్లూరు మండలం విఠలాపురంలో..



సీఎస్‌పురం: సీసీ రోడ్ల నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

● **ముండ్లమూరు:** మండలంలోని వేములలో సర్పంచి ఆదెమ్మ, సుబ్బారెడ్డి దంపతులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కెల్లంపల్లిలో మాజీ సర్పంచి ఎన్.శ్రీనివాసరావు సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో రావూరి జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు. ● **జరుగుమల్లి:** మండలంలోని పాలేటిపాడు పంచాయతీ సాధువారిపాలెం ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యడ్లూరిపాడులో రూ.40 లక్షలు, వర్ధినేనిపాలెం రూ.20 లక్షలు, నందనవనం రూ.25 లక్షలు, పాలేటిపాడు రూ.30 లక్షలు, చింతలపాలెం రూ.35 లక్షలు, చిర్రికూరపాడు రూ.25 లక్షలు, నర్సింగోలు రూ.25 లక్షలు, రామచంద్రాపురం రూ.20 లక్షలు, కామేపల్లి రూ.40 లక్షలు, చతుకుపాడు రూ.35 లక్షలు, అక్కచెరువుపాలెం గ్రామానికి రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి. కార్యక్రమంలో ఎంపీడీవో వి.ఎం.రమణమూర్తి, పంచాయతీ రాజ్ డీఈ రవిబాబు, నాయకులు పోకూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాహం కేకలు.. విద్యుత్తు సమస్యలు

● కనిగిరి కొత్తపేటలో తప్పని ఇక్కట్లు

కాలనీ కష్టాలు

న్యూస్‌టుడే, కనిగిరి

ముని్సపాలిటీ - కనిగిరి	
ప్రాంతం	- కొత్తపేట
కుటుంబాలు	- 2 వేలు
జనాభా	- 7 వేలు
సమస్యలు -	
మంచినీరు, కుక్కల బెడద, విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు, వెలగని వీధి లైట్లు, పారిశుద్ధ్య నిర్వహణ లేమి	

కనిగిరి పట్టణంలోని కొత్తపేట అంటే మున్సిపాలిటీకి గుండెకాయ లాంటిది. మొత్తం 2 వేలకు పైగా కుటుంబాలు ఉండే ఈ ప్రాంతంలో అధికారులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే, వ్యాపారులు, ఉద్యోగులు ఇక్కడే నివసిస్తుంటారు. ఇలాంటి చోట స్థానికులను నిత్యం సమస్యలు వేధిస్తున్నాయి. ఇక్కడ 600 అడుగులు లోతు వేసినా బోర్లలో నీరు పడని పరిస్థితి. ఒక్కో వీధిలో తల ఎత్తి చూసినంత మేర మేడలు, మిద్దెలు, కనిపిస్తుంటాయి. కానీ ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు నీటి కోసం ఎదురు చూపులే. ట్యాంకరు వస్తేనే గొంతు తడిచేది. 2018లో ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పైపులైన్ సైతం వేసింది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నీటి సరఫరా సంగతే మరిచిపోయింది. దీంతో కొంత మేర పైపులైన్ దొంగలపాలైంది. మిగిలినది అలంకారప్రాయంగా మారింది.



కొత్తపేటలో ఇళ్ల ముందు ఉన్న డ్రమ్ములు

ఇంటి ఆవరణల్లోనే స్తంభాలు..

కొత్తపేటలో 30 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్తు స్తంభాలు కావడంతో ఎక్కువగా అవి ఇళ్ల ఆవరణల్లోనే కనిపిస్తున్నాయి. మరికొన్ని తుప్పుపట్టిపోయి ప్రమాదకరంగా మారాయి. వీధిలైట్లు కొన్ని వీధుల్లో నిరంతరాయంగా వెలుగుతున్నాయి. కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రిపూట రాకపోకలు సాగించాలంటే భయాందోళన కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వెంటపడి కరుస్తున్నాయంటున్నారు. పేరుకు మాత్రం మురుగు కాలువలు ఉన్నా.. చాలా వరకు మట్టితో పూడుకుపోయాయి. వర్షం కురిసిన సమయంలో మురుగు, వర్షపు నీరు రోడ్డుపై పారుతూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఖాళీ స్థలాలు ఉండడంతో వాటిలో పిచ్చి మొక్కలు మొలిచి దోమలు, పందులకు ఆవాసాలుగా మారిపోయాయి. ఎప్పుడో వేసిన సీసీ రోడ్లు కావడంతో కొన్ని వీధుల్లో శిథిలావస్థకు చేరి రాకపోకలు ఇబ్బంది కలిగిస్తున్నాయి. దీంతోపాటు ఈ ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలలు ఉండడంతో ఆకతాయిల బెడద అధికంగా ఉంది. విద్యార్థినులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు పట్టణానికి గుండెకాయ లాంటి ప్రాంతమైనా అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉంది. ఈ విషయమై కమిషనర్ కె.డానియేల్‌జోసెఫ్‌ను వివరణ కోరగా.. కొత్తపేటలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.



పనిచేయని బోర్, కుళాయి



అధ్వానంగా సీసీ రోడ్డు



నిరుపయోగంగా పైపులైన్

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

20న పాటల పోటీలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ దర్శకుడు టి.కృష్ణ 38వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20న ఉదయం పది గంటలకు జిల్లాస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యుడు ఉప్పుటూరి ప్రకాశరావు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 19లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94909 52736 నంబరులో సంప్రదించాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చెల్లుబాటులోనే రూ.10 నాణేలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: రూ.పది నాణేలు వినియోగంలో లేవన్నది అపోహ మాత్రమేనని... అవి చెల్లుబాటులోనే ఉన్నాయని యూనియన్ బ్యాంకు చీమకుర్తి శాఖ సీనియర్ మేనేజర్ పి.లక్ష్మణ్ తెలిపారు. వాణిజ్య సంస్థలు, దుకాణాల్లో వాటిని వినియోగించవచ్చని తెలిపారు. ఈ విషయమై ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా... యరజర్ల, సర్వేరెడ్డిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.3.05 కోట్లతో చేపట్టనున్న పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. యరజర్లలో రూ.70 లక్షలు, సర్వేరెడ్డిపాలెంలో 2.35 కోట్లతో సిమెంట్ రహదారులు, గోకులాల నిర్మాణంతో పాటు, పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నారు. ఎంపీడీవో రాజశేఖర్, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఎంపీటీసీ సభ్యుడు గుండపనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తపట్నం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శ్రీకృష్ణ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆహ్లాదం... వర్షార్పణం

◗ నీరు నిలిచి రూపుకోల్పోయిన పార్కులు



చెన్నకేశవస్వామి లేఅవుట్‌లోని ఎన్టీఆర్ పార్కులో పరిస్థితి ఇది



భాగ్యనగర్ ఉద్యానం ఇలా...

గత అయిదేళ్లుగా కనీస నిర్వహణ లేక నగరంలోని పార్కులు రూపుకోల్పోయాయి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్) కింద కేంద్రం ఇచ్చిన నిధులతో కాస్తో కూస్తో పనులు జరిగాయంటే... ప్రస్తుత వర్షాలకు అవీ కొట్టుకుపోయాయి. ఆయా కాలనీల సంఘాలు చొరవ చూపి బాగుచేసుకున్న ఉద్యానాలు సైతం దెబ్బతిన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఉద్యానాల్లోనే నీరు నిలిచిపోవడంతో సమస్య నెలకొంది.

◗ భాగ్యనగర్, దేవుడుచెరువు, గాంధీ పార్కులను ఎన్‌క్యాప్ నిధులతో ఈ ఏడాదే బాగుచేశారు. రూ.పది లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వెచ్చించి వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటపరికరాల ఏర్పాటు, పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం లోపలంతా జలమయం కావడంతో ఇబ్బంది నెలకొంది. భాగ్యనగర్ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు కొంతమేర దెబ్బతిన్నాయి.

◗ చెన్నకేశవస్వామి లేఅవుట్‌లోని ఎన్టీఆర్ ఉద్యానంలో దక్షిణం వైపు నీరు నిలిచిపోయింది. గురువారం వ్యాహ్యాళికి వచ్చిన వారు అక్కడి పరిస్థితి చూసి వెనుదిరిగారు. లోపలి నీరు బయటకు పోయే మార్గం లేక తరచూ సమస్య తలెత్తుతోందని... కచ్చా కాలువైనా తవ్వించాలని అక్కడివారు కోరుతున్నారు. నెహ్రూనగర్ పార్కులోనూ మోకాలి లోతున నీరు చేరింది.

... నగర పాలక సంస్థ అధికారులు స్పందించి తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని... లేదంటే పిల్లల ఆట పరికరాలు తుప్పుపట్టి పాడయ్యే ప్రమాదం ఉందని ఆయా ప్రాంతాలవారు చెబుతున్నారు. ఇటీవల నాటిన మొక్కలు సైతం ఉరకెత్తి చనిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు నగరం



నిలిచిన నీటిలోనే పిల్లల ఆటలు



నెహ్రూనగర్ పార్కు..

తొలగిన చిక్కులు



స్పందనకు వందనం

మద్దిపాడు, న్యూస్‌టుడే: గుండ్లాపల్లి ప్రధాన బజారులో కాలువలు లేక... భారీ వర్షాలకు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమస్యను కొందరు స్థానికులు తెలియజేయడంతో... 'ఈనాడు - మేమున్నాం... మీకు తోడుగా' వేదికగా గురువారం ప్రచురితమైంది. సర్పంచి కొప్పోలు ఆంజనేయులు, కార్యదర్శి లతీఫ్ వెంటనే స్పందించి... జేసీబీ సాయంతో ప్రధాన బజారుతో పాటు, ఎస్సీ కాలనీలోనూ కచ్చా కాలువలు తవ్వించి సమస్యను పరిష్కరించారు.

బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వరదలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాల వారికి నిత్యావసర సరకులతో పాటు, నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరంలోని మదర్‌థెరెసా కాలనీలో సీపీఎం నాయకులు గురువారం పర్యటించారు. మూడు రోజుల పాటు పనులకు వెళ్లలేక పోయారని, ఇళ్లలోకి నీరు చేరడంతో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కాలనీలో స్తంభాలు వేసి మీటర్లు ఇవ్వాలని కోరారు. నాయకులు తంబి శ్రీనివాసులు, ఎస్డీ హుస్సేన్, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: పశువుల్లో గొంతువాపు వ్యాధి తలెత్తకుండా పాడి రైతులు జాగ్రతలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీఏ డాక్టర్ బేబీరాణి పేర్కొన్నారు. మద్దిరాలపాడులో గురువారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో మాట్లాడారు. ఒక్కో పాడి గేదెకు 30 కిలోలు చొప్పున మిశ్రమ దాణా అందజేస్తే పాల దిగుబడి పెరుగుతుందని సూచించారు. గేదెలకు గర్భకోశ పరీక్షలు, దూడలకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందు అందజేశారు. జీవాల పోషకులకు నట్టల నివారణ మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. పశువైద్యాధికారులు కె.అనూరాధ, పి.ప్రసన్న, సర్పంచి ఎస్.అనూరాధ పాల్గొన్నారు.



పాడి రైతులకు గ్రాసం అందజేస్తున్న జేడీఏ బేబీరాణి



ఒంగోలు – కొత్తపట్నం రహదారిలో టిడ్కో ఇళ్ల సమీపంలో పరిస్థితి



ఏడుగుండ్లపాడు ఎస్సీ కాలనీలో నిలిచిన నీరు



నాగులుప్పలపాడు: హనుమాపురం వాగు ఉద్ధృతి

వానలు మిగిల్చిన వెతలు



వినోదరాయునిపాలెంలో చెరువును తలపిస్తున్న వరి నారుమళ్లు

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వివిధ మార్గాల్లో పొంగిన వాగుల ఉద్ధృతి గురువారం కూడా కొనసాగింది. కొత్తకోట, హనుమాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దండువాళ్ల వాగు పొంగి... మాచవరం - ఉప్పుగుండూరు రహదారి కోతకు గురై పంటపొలాలు నీట మునిగాయి. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది పరిశీలించారు. ఉప్పుగుండూరు అంబేడ్కర్‌నగర్‌ను ముంచెత్తిన నీటిని... సర్పంచి జయమ్మ, పంచాయతీ అధికారులు జేసీబీ సాయంతో బయటకు తరలించారు. చదలవాడలో రామన్న చెరువు కట్ట తెగి 216 జాతీయ రహదారిలో రెండో రోజూ రాకపోకలకు అంతరాయం కలిగింది. సహాయక చర్యలను ఎంపీడీవో మహాలక్ష్మి పర్యవేక్షించారు. ❖ పదహారో నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఏడుగుండ్లపాడు ఎస్సీ కాలనీని ఇంకా వరద వీడలేదు. మూడు మార్గాల్లో మోకాలి లోతున నీరు నిలిచి ఉంది. మద్దిపాడు ఇస్లాంపేటలో వరద, మురుగు కలిసి రోడ్డుపైనే పేరుకుపోయాయి. పంచాయతీ కార్యాలయం సమీపంలోని కల్వర్టు నుంచి... గత మూడు రోజులుగా ఇంజిన్ల సాయంతో నిరంతరాయంగా నీటిని తోడిస్తున్నా పెద్దగా ఫలితం ఉండడం లేదు. ❖ కొత్తపట్నం - ఒంగోలు రహదారిలో చింతల సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద... రోడ్డుపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

– న్యూస్‌టుడే, బృందం



మంగమ్మ కళాశాల కూడలి – కర్నూలు రోడ్డు వంతెన మధ్య దుస్థితి





చదలవాడలో చెరువు కట్ట తెగి 216 జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు... వాహనాలు మళ్లించడంతో గుంతలు పడిన మార్గంలో రాకపోకలకు అవస్థలు

ఆధార్ నవీకరణకు అవకాశం

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఈ నెల 22 నుంచి 25 వరకు ఆధార్ కార్డుల నవీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. 22న మద్దిపాడు సచివాలయంలో... మద్దిపాడు, ఘడియాపూడి, వెల్లంపల్లి, నేలటూరు; 23న గుండ్లాపల్లి సచివాలయంలో... గుండ్లాపల్లి, కీర్తిపాడు, రాచవారిపాలెం, అన్నంగి, మల్లవరం, కొలచనకోట, దొడ్డవరం; 24న ఏడుగుండ్లపాడు సచివాలయంలో... ఏడుగుండ్లపాడు, పెదకొత్తపల్లి, లింగంగుంట, దొడ్డవరప్పాడు; 25న బసవన్నపాలెం సచివాలయంలో... బసవన్నపాలెం, సీతారామపురం, ఇనమనమెళ్లూరు గ్రామస్థుల కోసం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇవి కొనసాగుతాయని... అన్ని రకాల ఆధార్ సేవలకు అవకాశం ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి పల్లె పండగ వివరాలివి...

'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టబోయే పనులకు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్... శుక్రవారం శంకుస్థాపనలు చేస్తారని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. లింగంగుంట, నందిపాడు, గుండ్లాపల్లి, నాగన్నపాలెం, రాచవారిపాలెంలో సిమెంట్ రోడ్లు, కాలువల పనులు ప్రారంభిస్తారన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు ఎ.ప్రసాద్, సామాజిక కార్యకర్త శామ్యూల్... మహర్షి జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పల్లె పండగలో భాగంగా గుమ్మళంపాడులో రూ.20 లక్షలతో చేపట్టనున్న పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులతో పల్లెల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ, అభివృద్ధి పాలన సాధ్యమని పేర్కొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఆర్ డీఈ కృష్ణమోహన్, ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు, స్వాములు, మాజీ సర్పంచులు ఆర్.అంకారావు, నెప్పలి కనకయ్య తదితరులు పాల్గొన్నారు. ❖ పి.తక్కెళ్లపాడులో రూ.10 లక్షలు, ఎం.వేములపాడులో రూ.30 లక్షలు, బొడ్డువారిపాలెంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, కాలువల పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచి నలమోతు శ్రీనివాసరావు, పోకూరి వెంకట్రావు, మారెళ్ల శ్రీనివాసరావు, సర్పంచి ఈర్ల విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ మండవ సులోచన, రావుల సుబ్బారావు, పాతూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

త్వరలోనే పక్కా గృహాల బిల్లుల చెల్లింపు

ఒంగోలు గ్రామీణం: 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పక్కా ఇళ్లు నిర్మించుకుని బిల్లులు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు... త్వరలోనే ఆ మొత్తాలు చెల్లిస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆయా గృహాల వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. గురువారం నిర్వహించిన ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. అవసరమైన గ్రామాల్లో ఉచిత పశు వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే తక్షణం పరిష్కరించాలన్నారు. ఎంపీపీ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ...ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పాతపాడు, చేజర్ల గ్రామాల్లో పాఠశాలలు; దశరాజుపల్లె, పాతపాడు, చింతాయగారిపాలెం గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసు సమస్యలను స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎంపీడీవో రాజశేఖర్, తహసీల్దార్ వాసు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఇరుకు దారులు... నిత్యం చిక్కులు





నగరంలో కీలకమైన గాంధీరోడ్డును ఆనుకుని ఉన్న దక్షిణ బజార్, పప్పు బజార్, బండ్లమిట్ట వీధులు ఇరుగ్గా ఉండడం... వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో నిత్యం చిక్కులు తలెత్తుతున్నాయి. వివిధ రకాల దుకాణాలు ఈ ప్రాంతంలో కొలువుదీరడంతో వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో తరచూ ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్ల క్రితం నిర్మించిన కాలువలు ప్రస్తుత అవసరాలకు చాలడం లేదు. గట్టిగా వర్షం పడితే నీరు నిలిచిపోతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గాంధీరోడ్డు (ఒంగోలు అంజయ్య రోడ్డు)

చిల్లచెట్లు పెరిగి అవస్థలు



45వ డివిజన్‌లో భాగంగా ఉన్న శ్రీనగర్‌కాలనీలో గత అయిదేళ్లుగా వసతుల మెరుగుకు కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో అంతర్గత మార్గాలు, కాలువలు అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యంగా ఇక్కడి ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చిల్ల చెట్లు ఏపుగా పెరగడంతో పాములు, విష కీటకాల సంచారం పెరిగింది. వీధి దీపాలు సైతం సరిగా వెలగక రాత్రివేళ బయటకు రావాలంటేనే స్థానికులు ఆందోళన చెందున్నారు. కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శ్రీనగర్ కాలనీ (ఒంగోలు అంజయ్యరోడ్డు)

సుజాతానగర్... సమస్యలతో బేజార్!

న్యూస్‌టుడే – ఒంగోలు అంజయ్యరోడ్డు

సుజాతానగర్... 37వ డివిజన్‌లో భాగంగా ఉన్న ఈ ప్రాంతంలో ఎటు చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. ఓ మోస్తరు వర్షం పడినా అంతర్గత మార్గాల్లో నీరు నిలిచి... రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మురుగు పారుదల వ్యవస్థా అస్తవ్యస్తంగా ఉండడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.

అన్ని లైన్లలోనూ సమస్యలే...

❖ 8, 9, 12 లైన్లలో కాలువల నిర్మాణమే చేపట్టలేదు. దీంతో రోడ్లపైకి మురుగు చేరి సమస్య నెలకొంటోంది. మూడో లైన్‌లో కాలువలు ఉన్నా వ్యర్థాలతో పూడిపోయి మురుగు ముందుకు సాగడం లేదు. రోజుల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో... తీవ్ర దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

❖ 6, 10 లైన్లలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టలేదు. మట్టి దారుల్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వర్షాలకు అవి చిత్తడిగా మారడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

❖ 3, 4 లైన్లతో పాటు మరికొన్ని ప్రాంతాలకు కుళాయి నీరు సరిగా అందడం లేదు. ముఖ్యంగా చివరి ఇళ్లకు చుక్క నీరు రావడం లేదు. పలుమార్లు సమస్య తెలియజేసినా పట్టించుకోలేదని కొందరు స్థానికులు తెలిపారు. అందరికీ నీరందేలా చర్యలు తీసుకోవాలని లక్ష్మి అనే మహిళ కోరారు.



పదో లైన్‌లో అభివృద్ధికి నోచని రహదారి

కుక్కలతో బెంబేలు...

వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. వాహనదారుల వెంటపడి తరుముతుండడంతో వారు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పిల్లలపైనా దాడి చేస్తుండడంతో... ఒంటరిగా దుకాణాలకు పంపాలన్నా భయపడుతున్నామని అక్కడి మహిళలు చెబుతున్నారు. అన్నిటికీ మించి... రాత్రివేళ గుంపులుగా తిరుగూ అరుస్తుండడంతో కంటి నిండా నిద్ర కరవవుతోందని వాపోతున్నారు. వాటి నియంత్రణకు కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో చిట్ల చెట్లు పెరిగి పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని... సంబంధిత యజమానులు ఆయా జాగాలను శుభ్రం చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రధాన మార్గంలో పరిస్థితి ఇది..



12వ లైన్‌లో కాలువ లేక రోడ్డుపైకి చేరుతున్న మురుగు

కర్నూలు రోడ్డుకు మరమ్మతులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు కర్నూలు రహదారిలోని యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద రహదారిపై వెట్‌మిక్స్ వేసి మెరుగు పరుస్తున్నారు. ఈప్రాంతంలో రహదారి అధ్వానంగా మారి కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా నీరు పారుతూ వాగును తలపించింది. దీనిపై 'వాగు కాదు కర్నూలు రాచబాటే' శీర్షికన ఈ నెల 16న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. దీంతో రెండు రోజులుగా వివిధ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే మోటార్లను ఏర్పాటుచేసి నీరంతా బయటకు పంపించారు. కంకర, సిమెంటు మిశ్రమం (వెట్‌మిక్స్)తో భారీ గోతులు పూడ్చిస్తున్నారు. స్థానిక కంకర మిల్లుల, ఇతరుల సహకారంతో వీటిని చేస్తున్నారు. పనుల స్థితిగతులను ఉన్నతాధికారులు పరిశీలించారు. గురువారం జిల్లా భూగర్భ గనుల అధికారి రాజశేఖర్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ దేవానందం, ఈఈ గోపీనాయక్, తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర తదితరులు పరిశీలించి సూచనలిచ్చారు. ఆయా యూనియన్ల ప్రతినిధులు లగడపాటి శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి మధుసూదనరావు, యర్రగుంట్ల శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


రహదారిపై నీటిని తోడిన తర్వాత పరిస్థితిని పరిశీలిస్తున్న గనుల శాఖ అధికారి రాజశేఖర్ తదితరులు

ఈనాడు కథనానికి స్పందన

బౌద్ధ ధర్మంతో సమస్యలకు పరిష్కారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్థిక, సామాజిక, మత, రాజకీయ సమస్యలకు పరిష్కారం చూపగలిగేది బౌద్ధ ధర్మమని డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. ప్రకాశం బౌద్ధ దమ్మ ప్రచారకుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో... అంబేడ్కర్ బౌద్ధ ధర్మ స్వీకారోత్సవం, దమ్మ ప్రవర్తన దినోత్సవం సందర్భంగా గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి చుండూరి రంగారావు మాట్లాడుతూ బౌద్ధ ధర్మం గొప్పదని పేర్కొన్నారు. ప్రకాశం భవన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వివిధ సంఘాల ప్రతినిధులు చావలి సుధాకర్‌రావు, సీహెచ్ సుధీర్, ఎ.మహేష్ నాగ, బి.రాజేష్, కె.అనిల్, ఆనంద్‌సాయి, న్యాయవాది బుద్ధకోటి దాసరి సుందరం, బర్రె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

అక్రమార్కులపై అవ్యాజ ప్రేమ

❖ అక్రమ వెంచర్లతో రూ.కోట్ల స్వాహా

❖ అధికారుల తీరుపై అనుమానాలు


కూల్చివేతే తప్ప స్వాధీనమేదీ..దేవాంగ్‌నగర్‌లో దృశ్యం

కనిగిరి ప్రాంతంలో స్థిరాస్తి ముసుగులో రూ. కోట్లు స్వాహా చేసిన అక్రమార్కులపై చర్యలకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురపాలక సంఘం పరిధిలో అసైన్డ్, పట్టా భూముల్లోని అక్రమ వెంచర్లలో సరిహద్దు రాళ్లను యంత్రాలతో పెకిలించి పడేశారు. ఆ తర్వాత వారిపై చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే అదనుగా అక్రమార్కులు ప్లాట్లు అమాయకులను అంటగట్టి మళ్లీ దండుకుంటున్నారు.

న్యూస్‌టుడే, కనిగిరి :

కనిగిరి ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గడచిన రెండేళ్లలో రెవెన్యూ డివిజన్ కావడంతో పాటు గ్రేడ్ -2 మున్సిపాలిటీగా అవతరించింది. అదే సమయంలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు చకచక సాగుతున్నాయి. దండుకునేందుకు అదే సరైన తరుణమని భావించి గత ఎన్నికల ముందు వైకాపా నేతలు పేట్రేగిపోయారు. కంభం రోడ్డు, పామూరు రోడ్డు, ఒంగోలు రోడ్డు; గార్లపేట, కందుకూరు మార్గాల్లో వందలాది ఎకరాల పశువుల బీడు, ప్రభుత్వ, అసైన్డ్, వాగు పోరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించేశారు. వెంచర్లు వేసి విక్రయించేశారు.

ఇష్టారాజ్యంగా వెంచర్లు వేసి..

కాశిరెడ్డినగర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న 4.70 ఎకరాల అసైన్డ్ భూమిని గత వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు కౌన్సిలర్లు ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించారు. కనిగిరి - పామూరు రోడ్డులో జాతీయ రహదారి పక్కనే నాలుగెకరాల రోడ్డు పోరంబోకు, పశువుల బీడునూ కబ్జా చేశారు. రూ.5 కోట్ల విలువ చేసే ఈ భూమిలో వెంచర్లు వేసి సొమ్ము చేసుకున్నారు. కనిగిరి పొదిలి రోడ్డు మార్గంలో జాతీయ రహదారి పక్కనే ఓ వైకాపా ప్రజా ప్రతినిధి రూ.3 ఎకరాల పశువుల బీడును ఆక్రమించి పురాతన బావిని పూడ్చించి ప్లాట్లు వేసి అమాయకులకు అంటగట్టి రూ. కోట్లు దండుకున్నారు.


కంభం రోడ్డులో అనుమతి లేని స్థిరాస్తి భూములు

ఆదిలో ఆర్భాటం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో అధికారులు వరుసగా దాడులు జరిపి అక్రమ వెంచర్లలో పునాది రాళ్లను తొలగించి హడావుడి చేశారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా నేటికీ వాటిని స్వాధీనం చేసుకోవడంపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు దృష్టి సారించలేదు. రూ. కోట్లు దండుకున్న వారిపై చర్యలకు ఉపక్రమించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ అక్రమ వెంచర్లను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆక్రమణకు గురైన కొన్ని భూములను గుర్తించామన్నారు. ఇప్పటికే కొన్ని కట్టడాలు, అక్రమ లేఅవుట్లను, వెంచర్లను స్వాధీనం చేసుకున్నామని మిగిలిన వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.

జరుగుమల్లిలో అత్యధిక వర్షపాతం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వరుసగా నాలుగో రోజు కూడా మోస్తారు వర్షం కురిసింది. జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా జల్లులు పడ్డాయి. మండలాల వారీగా వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి...

మండలం	వర్షపాతం(మి.మీ)	మండలం	వర్షపాతం(మి.మీ)
జరుగుమల్లి	80.8	పొన్నలూరు	39.2
మద్దిపాడు	71.6	సీఎస్‌పురం	38.8
టంగుటూరు	67.7	పెద్దదోర్నాల	36.3
కొండపి	68.6	చీమకుర్తి	35.6
తాళ్లూరు	56.6	సింగరాయకొండ	34.8
ఒంగోలు	50.8	కొత్తపట్నం	32.1
సంతనూతలపాడు	46.2	తర్లుపాడు	30.8
మర్రిపూడి	40.4	నాగులుప్పలపాడు	29.2

(బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు)

నేడు షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

పేర్నమిట్ట(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: పేర్నమిట్టలోని జడ్పీహెచ్‌ఎస్‌లో షూటింగ్ బాల్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపిక చేపడుతున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ కొల్లా నారాయణరావు పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్లు అక్టోబర్ 20, 21 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల లిస్టు, కాపీలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

కేజీబీవీ పోస్టులకు మెరిట్ జాబితా విడుదల

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్రశిక్ష సొసైటీ పరిధిలోని కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తు చేసిన వారి ప్రాథమిక మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో డి.సుభద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వగా అర్హులైన వారు దరఖాస్తు చేశారన్నారు. వాటిని పరిశీలించిన అనంతరం మెరిట్ జాబితాను సమగ్రశిక్ష వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. దరఖాస్తుదారులు పరిశీలించుకొని ఏమైనా అభ్యంతరాలుంటే శుక్ర, శనివారాల్లో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

ఏపీఐఐసీ స్థలంలో ఆక్రమణల తొలగింపు

❖ పేర్నమిట్టలో ఉద్రిక్తత

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: పేర్నమిట్టలో పొగాకు బోర్డును ఆనుకొని కర్నూల్ రహదారి వెంట ఏపీఐఐసీకి చెందిన సర్వే నెంబర్ 102లోని రోడ్డు వెంట ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. సుమారు 15 ఏళ్ల నుంచి పొగాకు బోర్డు పక్కన ఏపీఐఐసీకి చెందిన స్థలాలను ఆక్రమించి పలువురు ఇళ్లు కట్టుకొని నివాసముంటున్నారు. ఆక్రమణలు తొలగించాలని పలువురు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాలు రావడంతో జేసీ సూచనలతో ఏపీఐఐసీ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పెద్దఎత్తున సర్వే నెం102 ప్రాంతానికి వెళ్లారు. వారు మున్సిపాలిటీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అక్రమ నిర్మాణదారులతో మాట్లాడారు. అనంతరం జేసీబీ సాయంతో ఒక్కో కట్టడాన్ని తొలగించారు. రహదారి పక్కనున్న సుమారు 14 ఇళ్లను, పలు షాపులను కూల్చివేశారు.

పరిహారం ఇవ్వాలంటూ ఆందోళన

పొగాకు బోర్డు దగ్గరి నుంచి ఆంజనేయస్వామి దేవస్థానం వరకు ఉన్న కట్టడాల తొలగింపు సందర్భంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బాధితులు తమ నిరసన వ్యక్తం చేశారు. తాము ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్నామని, ఎలాంటి సమాచారం లేకుండా తొలగింపులు చేపట్టడం సరికాదన్నారు. కనీసం తమకు నష్ట పరిహారం కూడా ఇవ్వకుండా చర్యలు చేపట్టడం ఏమిటంటూ వారిని నిలదీశారు. అధికారులు వారికి సర్ది చెప్పి కార్యక్రమం పూర్తిచేయించారు.


జేసీబీతో ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం

ఏటీఎం కేంద్రంలో చోరీకి విఫల యత్నం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ప్రధాన రహదారి ఎన్నెస్పీ కాలనీలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో చోరీకి విఫలయత్నం జరిగింది. గురువారం తెల్లవారుజామున దొంగలు ఏటీఎం కేంద్రం తలుపులు మూసివేసి సీసీ కెమేరాకు రంగు స్ప్రే పిచికారీ చేశారు. అనంతరం నగదు యంత్రాన్ని పగులగొట్టే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా సైరన్ మోగడంతో స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోగా దుండగులు అప్పటికే పరారయ్యారు. ఎలాంటి నగదు చోరీ జరగలేదు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


టంగుటూరు : ఎం.నిడమానూరు - కె.ఉప్పలపాడు మధ్య ముసి వాగు ఉద్ధృతి


నాగులుప్పలపాడు : దండువాళ్ల వాగు ధాటికి కోతకు గురైన రహదారి

శాంతించని వాగులు.. వంకలు

న్యూస్‌టుడే బృందం :

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు పడుతుండటంతో జిల్లాలోని వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం జిల్లాను వాన ముంచెత్తడంతో ముసి వాగుకు వరద పోటెత్తింది. ఎం.నిడమానూరు-కె.ఉప్పలపాడు గ్రామాల మధ్య ఉన్న చప్టాపై గురువారం కూడా నీరు పరవళ్లు తొక్కింది. ముండ్లమూరు మండలంలోని మారెళ్ల సమీపంలో ఈదరవాగు వద్ద చప్టాపైనుంచి నీరు ప్రవహిస్తోంది. గత తెదేపా హయాంలో ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. చప్టా కింది భాగంలో వ్యర్థాలు, పూడిక చేరడంతో నీరంతా నిలిచిపోయింది. దీంతో మారెళ్లతో పాటు, మక్కెనవారిపాలెం, జమ్ములమడకవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మారెళ్లకు చెందిన తెదేపా నాయకులు రాఘవరెడ్డి, డాక్టరు వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు జేసీబీతో వ్యర్థాలు తొలగింపజేశారు.

❖ ఒంగోలు మండలం కరవది-గుత్తికొండవారిపాలెం గ్రామాల మధ్య ముదిగొండ వాగు పరవళ్లు తొక్కుతోంది. చప్టా పైనుంచి వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఆ మూడో రోజు కూడా రాకపోకలు నిలిచాయి. కొత్తపట్నం మండలం సంకువానికుంట గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్ద ఉద్ధృతి కొంత మేర తగ్గింది. ఈతముక్కల- ఆలకూరపాడు మధ్య రాకపోకలు నిలిచిపోగా; అత్యవసరమైన వారు మాత్రం చప్టా మీదుగా దాటుతున్నారు.


ఒంగోలు గ్రామీణం : సంకువానికుంట వద్ద పెద్దవాగు ప్రవాహం

❖ నాగులుప్పలపాడు మండలంలోని కొత్తకోట వద్ద, హనుమాపురం వద్ద వాగులు పొంగి ప్రవహించి ఆ మార్గంలోని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మాచవరం-ఉప్పుగుండూరు మధ్య దండువాళ్ల వాగు ఉద్ధృతికి రహదారి కోతకు గురవ్వగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు.

సార్వత్రిక పది, ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

ఒంగోలు నగరం: సార్వత్రిక పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 25 వరకు అవకాశం కల్పించినట్లు విద్యాశాఖ పరీక్షల విభాగం అధికారి శివకుమార్ పేర్కొన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్ పొందవచ్చన్నారు. అపరాధ రుసుం రూ.200తో ఈ నెల 29 వరకు; రూ. వెయ్యి అపరాధ రుసుంతో 31 వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు.

నేడు, రేపు ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 18, 19న ఒంగోలులో పర్యటించనున్నారు. 18న ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఒంగోలులో జరగనున్న స్థానిక కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 130, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

మద్యం మత్తులో భార్య గొంతు కోసిన భర్త

❖ తీవ్ర రక్తస్రావంతో మృతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో భార్యను భర్త కత్తితో గొంతు కోసి హతమార్చాడు. ఈ సంఘటన మండలంలోని ఊళ్లపాలెంలో గురువారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్టా వెంకట్రావు, తిరుపతమ్మ (25) దంపతులు. వారు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వెంకట్రావు మద్యానికి బానిసై నిత్యం భార్యను వేధిస్తున్నాడు. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం మద్యం తాగి ఇంటికొచ్చి భార్యతో ఘర్షణకు దిగాడు. ఆవేశంతో ఇంటిలోని చాకుతో ఆమె గొంతు కోశాడు. రక్తం మడుగులో పడివున్న తిరుపతమ్మను స్థానికులు వెంటనే వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కందుకూరు తరలించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తెదేపా కార్యకర్త దుర్మరణం

❖ మరొకరికి గాయాలు

మార్కాపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తెదేపా కార్యకర్త మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి మార్కాపురంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన తెదేపా క్రియాశీల కార్యకర్త కూరపాటి రాజశేఖర్ సామేలు (37) బుధవారం రాత్రి సౌజన్య కల్యాణ మండపంలో జరిగిన వివాహానికి హాజరైన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికొస్తున్నారు. అదే సమయంలో పదో వార్డుకు చెందిన ఎం.అశోక్ ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో వచ్చి సామేలు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తెదేపా కార్యకర్త సామేలు అపస్మారక స్థితికి చేరగా, అశోక్‌కు గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు సామేలు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి వైద్యశాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు. మృతుడికి భార్య ఎలిజిబెత్ రాణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.


మృతుడు రాజశేఖర్

గుండ్లకమ్మలో యువకుడు గల్లంతు

మద్దిపాడు: గుండ్లకమ్మ వాగులో పడి ఓ యువకుడు గల్లంతైన సంఘటన గురువారం రాచవారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాచవారిపాలేనికి చెందిన గంగిశెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు బ్రహ్మనాయుడు మిత్రులతో కలసి గురువారం సాయంత్రం గుండ్లకమ్మ నది ఒడ్డుకు వెళ్లారు. అనంతరం బ్రహ్మనాయుడు పడవ ఎక్కి చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లారు. ప్రవాహ తాకిడికి పడవ బోల్తాపడటంతో ఆయన గల్లంతయ్యారు. స్నేహితులు నది సమీపంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. అతనికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలున్నారు. స్థానిక పోలీసులు, తహసీల్దార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.


బ్రహ్మనాయుడు (పాత చిత్రం)

పంటలకు తీరని నష్టం

న్యూస్‌టుడే బృందం: భారీ వర్షాల కారణంగా సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో మినుము, మిరప, కూరగాయల పంటలతో పాటు పొగాకు నారుమళ్లు దెబ్బతిన్నాయి. వందలాది ఎకరాల్లో కోతకు వచ్చిన సజ్జకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో మొక్కలు ఉరకెత్తాయి. నాగులుప్పలపాడులో దెబ్బతిన్న సజ్జ పంటను జేడీఏ శ్రీనివాసరావు, ఏవో వెంకట్రావు... గురువారం పరిశీలించారు.


నాగులుప్పలపాడు: దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు


చీమకుర్తి: మంచికలపాడులో నల్లగా మారిన సజ్జ కంకులు

ముప్పూరి సుబ్బారావుకు నివాళి

చీమకుర్తి: తెలుగు రైతు నాయకుడు ముప్పూరి సుబ్బారావు మృతితో మంచి నాయకుడిని కోల్పోయామని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చీమకుర్తి చినరాస్తాలో గురువారం నిర్వహించిన సుబ్బారావు సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు చలమయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, తెదేపా నాయకులు మన్నం ప్రసాదరావు, రాఘవరావు, హరిబాబు, రమణయ్య, హనుమంతరావు, రామబ్రహ్మం, శేషయ్య, బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు